ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 | సంచిక : 10 | జూన్ 2011

**రమణ భాస్కర**
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**చందా**
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు ~ 534 265
☎ 08814 - 224747
📱 9247104551

ఈ సంచికలో....

కొమ్మర ........... 12-04-2011
చించినాడ ...... 19-03-2011
ముమ్మిడివరం .. 17-04-2011

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 📱 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-04-2011, కొమ్మర)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ కొమ్మర గ్రామంలో నా శరీరం జన్మించింది. ఇక్కడ రామాలయం పునర్‌నిర్మాణం చేశారు. దేవాలయాలు కొత్తగా కట్టటం కంటే పాడైపోయిన దేవాలయాల్ని తిరిగి నిర్మించటం మంచిది. ప్రతీ గ్రామంలో సీతారాముల దేవాలయాలు ఉంటాయి. కాని ప్రజలు ఎవరూ సద్వినియోగం చేసుకోవటంలేదు. ఆలయం నిర్మించటం వేరు, దానిని సద్వినియోగం చేసుకోవటం వేరు. ప్రతీ మనిషిలో మంచి ఉంటుంది, చెడ్డ ఉంటుంది. మీకు దగ్గరలో దేవాలయం ఉంటే ఉదయం కాని, సాయంత్రం కాని దర్శనం చేసుకోవటం మంచిది. అలా దర్శనం చేసుకోవటం వలన మీ మనస్సులో ఉన్న చెడ్డ తగ్గుతూ ఉంటుంది, మంచిపెరుగుతూ ఉంటుంది. హిందువుల హృదయంలో ఉన్న దేవుడు రాముడు ఒక్కడే అని, ఎక్కడ పదిమంది హిందువులు ఉంటే అక్కడ సీతారాములు ఉంటారు అని, సీతారాములను స్మరించుకోకుండా ఏ హిందువు కూడా ఉండడు అని హైదరాబాదులో ఒక సభలో వివేకానందుడు చెప్పాడు. మేము రాక్షసుల బాధ భరించలేక పోతున్నాము, మమ్మల్ని యజ్ఞాలు అవీ చేసుకోనివ్వటంలేదు, భయ పెట్టేస్తున్నారు అని ఋషులు సనత్‌కుమారునితో చెప్తారు. మీరు కొంతకాలం ఓపిక పట్టాలి. భవిష్యత్తులో మహావిష్ణువు రాముడిగా జన్మించి రాక్షస సంహారం చేస్తాడు. అప్పటివరకూ మీకు కొన్ని బాధలు తప్పవు అని సనత్‌కుమారుడు ఋషులకు చెప్పాడు. దశరథమహారాజు చేత ఋష్యశృంగుడు పుత్రకామేష్టి యజ్ఞం చేయించాడు. తరువాత శ్రీ ఖరనామ సంవత్సరం చైత్రమాసం, తిథి

నవమి రోజున కౌశల్య గర్భాన రాముడు జన్మించాడు. వాల్మీకి రామాయణం వ్రాసేముందు 16 మంచి గుణాల గురించి నారదుడిని అడుగుతూ ఈ పదహారు మంచిగుణాలు ఉన్నవాళ్ళు ఈ భూమిమీద ఎవడైనా సంచరించాడా అని అడిగితే, ఈ పదహారు గుణాలు రాముడిలో ఉన్నాయని నారదుడు చెప్పాడు. మీకు ఆ పదహారు మంచిగుణాలు అక్కరలేదు, ఒక మంచిగుణం ఉంటే మీరు అందరూ అభివృద్ధిలోనికి వస్తారని చెప్పాడు. రాముని చరిత్ర నారదుడు టూకీగా చెబితే, వాల్మీకి రామాయణం అంతా దర్శించి ఒకమాట చెప్పాడు. అమృతదోషం ఎలా ఉంటుందో తెలియకుండా ఈ రామాయణ కావ్యం వ్రాస్తున్నాను అని చెప్పాడు. వాల్మీకి మహా పవిత్రుడు. రామాయణాన్ని ఆదికావ్యం అంటారు. వాల్మీకిని ఆదికవి అంటారు. రాముడి గురించి వాల్మీకి మాట్లాడుతూ పూర్వభాషి అన్నాడు. ఎవరైనా కనిపిస్తే మీరు బాగున్నారా అని వారి క్షేమం గురించి ముందే పలకరిస్తాడు, వాడు రాముడు.

రాముడు రాక్షస సంహారం గురించి జన్మించినా, ఒక మానవుడిగా కనిపించి మానవుడికి ఎన్ని కష్టసుఖాలు వస్తాయో అవి అన్నీ అనుభవించి చూపించాడు. మాకు ఉన్న కష్టాలు ఎవరికీ లేవేమో అని మీరు అనుకుంటున్నారు. మీకు ఉన్న కష్టాలకంటే వందరెట్లు ఎక్కువ కష్టాలు రాముడు అనుభవించాడు. రామాయణం చదివితే మీకు తెలుస్తుంది. రాముడు ధర్మస్వరూపుడు. ధర్మమే ఒక శరీరంగా జన్మించింది. రాముడు జోలికి మనం వెళ్ళటం మంచిది కాదు, రాముడు మహాత్ముడు, మహాబలవంతుడు, అధర్మం ఎలా ఉంటుందో రాముడికి తెలియదు అని మారీచుడు రావణాసురిడికి చెప్పాడు. ధర్మం అంటే దానంకాదు. ధర్మము అంటే ఒక జీవిత విధానం. మన మనస్సుని, ఇంద్రియాలని కంట్రోలు చేసుకుని, మన మనస్సుని నిదానంగా ఉంచుకుని అధర్మం వైపుకి, అన్యాయం వైపుకి వెళ్ళకుండా జీవితం పొడుగునా న్యాయంగా జీవించటం. ధర్మం అంటే అది. మనం కూడా ఎంతో కొంత ధర్మాన్ని ఆచరిస్తున్నాము కానీ రాముడికి, మనకి తేడా ఏమిటి అంటే, మనకి ఏదైనా భయం వేసింది అనుకోండి ధర్మాన్ని వదిలేస్తాము. రాముడు ఎట్టి పరిస్థితులలోనూ వాడికి ప్రాణం పోయినా ధర్మాన్ని విడిచిపెట్టడు. వాడు రాముడు. కైకేయి దశరధుడితోటి భరతుడికి పట్టాభిషేకం చేయమని, రాముడిని 14 సంవత్సరాలు అరణ్యవాసానికి పంపాలని చెప్పింది. అప్పడు లక్ష్మణుడు చెప్పాడు పితృవాక్య పరిపాలన చెయ్యవద్దు, ధర్మాన్ని విడిచి పెట్టమని చెప్పాడు. ఎట్టి పరిస్థితులలోను ధర్మాన్ని విడిచిపెట్టను అని రాముడు చెప్పాడు. రాముడు వేరు, ధర్మంవేరు కాదు. ధర్మమే రాముడు రూపం ధరించింది. రాముడూ

అవతారపురుషుడే, కృష్ణుడూ అవతారపురుషుడే, అయితే మన మనస్సుకీ, బుద్ధికీ, మన ఇంద్రియాలకీ కృష్ణుడు అందడు. రాముడు మనకి దగ్గరగా ఉంటాడు. మన కష్టసుఖాలకి అందుతాడు. మనకి అందే దేవుడు రాముడు, మనకి అందని దేవుడు కృష్ణుడు.

శ్రీరామనవమి అంటే రాముడు పుట్టినరోజు, కానీ శ్రీరామనవమి రోజున సీతారాముల కళ్యాణం చేస్తారు. కళ్యాణం శ్రీరామనవమి రోజున ఎందుకు చేస్తారంటే శ్రీరాముడు పుట్టటమే మనందరికీ కళ్యాణప్రదం అని శ్రీరామనవమి రోజునే సీతారాములకి కళ్యాణం చేస్తారు. సీత, రాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, హనుమంతుడు వీళ్ళని స్మరించుకునే అలవాటు మనకు ఎందుకు లేదు అంటే వాళ్ళని స్మరించుకోవటం వలన మన బుద్ధి శుద్ధి అవుతుంది అని మనకు తెలియక వారిని స్మరించుకోము. మనిషి పవిత్రుడు అవ్వాలి అంటే, వాడికిఏకాగ్రత రావాలి అంటే, వాడి మనస్సు నిదానంగా ఉండాలి అంటే రామనామాన్ని పట్టుకోవాలి. రైలు పట్టాలని విడిచిపెట్టకుండా ఎలా పరుగెడుతుందో అలాగే మన జీవితంలో మనం ధర్మాన్ని పట్టుకుని నడవటానికి ఒక రామనామస్మరణ తప్పించి ఇంకొక మార్గం లేదు. రామాయణంలో తత్వశాస్త్రం ఉంది, ధర్మశాస్త్రం ఉంది, గృహస్థధర్మాలు కూడా చెప్పారు, ఆత్మజ్ఞానం ఎలా సంపాదించాలో కూడా రామాయణంలో చెప్పాడు. నీకు కోపం వచ్చినా, ద్వేషం కలిగినా, భయం కలిగినా, ఎప్పుడైనా అసహనం వచ్చినా, చిరాకు వచ్చినా, పరాకు వచ్చినా ఎటువంటి పరిస్థితులలో కూడా ధర్మాన్ని విడిచిపెట్టవద్దు అని వాల్మీకి రామాయణంలో చెప్పాడు.

విశ్వామిత్రుడు దశరధుడి దగ్గరకు వచ్చి, నేను యజ్ఞాలు, యాగాలు చేసుకుంటున్నాను, రాక్షసులు వచ్చి ఇబ్బందులు పెడుతున్నారు, ఆ యజ్ఞాలు రక్షించటానికి రాముడిని పంపించమని అడిగితే, రాముడు చిన్నపిల్లవాడు నేను వచ్చి మీ యజ్ఞాలను రక్షిస్తాను అన్నాడు దశరధుడు. విశ్వామిత్రుడు అంటే సామాన్యంకాదు సృష్టికి ప్రతిసృష్టి చేసిన వాడు. గాయత్రీ మంత్రాన్ని కనిపెట్టినవాడు. విశ్వామిత్రుడు రాముడిని ఒక మంచి కోసమే పంపించమంటున్నాడు అందుచేత దశరధమహారాజా నువ్వు సందేహించనక్కరలేదు అని వశిష్ఠుడు చెబుతాడు. అప్పుడు రామలక్ష్మణులని విశ్వామిత్రుడి వెంట పంపుతాడు. విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు చాలా యుద్ధ రహస్యాలు చెప్పాడు. ప్రవర్తన ఎలా ఉండాలో చెప్పాడు. రాగద్వేషాలు వేగం వచ్చినప్పుడు ఎలా తట్టుకోవాలో చెప్పాడు. భవిష్యత్తులో వీళ్ళు అరణ్యవాసం చెయ్యాలి కాబట్టి ముందే గ్రహించి కింద గడ్డిపరచి దాని మీద పడుకోమన్నాడు. కౌశల్యాసుప్రజా రామా అని ప్రొద్దుటే నిద్రలేపేవాడు విశ్వామిత్రుడు. ఆ

శ్లోకం విశ్వామిత్రుడి నోటమ్మటా వస్తే అది వాల్మీకి వ్రాసాడు. ఆ శ్లోకాన్నే వేంకటేశ్వర సుప్రభాతంలో మొదటి శ్లోకంగా వ్రాసారు.

విశ్వామిత్రుడి యజ్ఞ సంరక్షణార్థం రామలక్ష్మణులు అక్కడకు వచ్చిన రాక్షసుల్ని సంహరించాలి. మొదట తాటకి అనే స్త్రీ రాక్షసి వస్తుంది. అప్పుడు రాముడు అంటాడు పురుషుల్ని చంపవచ్చునుకాని స్త్రీలను చంపటం నాకు ఇష్టం లేదు అంటాడు. రామా నువ్వు ధర్మాన్ని స్థాపించటానికి ఈ భూమి మీదకు వచ్చావు. నీ డ్యూటీ నువ్వు చెయ్యాలి. నీ డ్యూటీ నువ్వు చేసేటప్పుడు ఆడదానిని చంపటం అశుభకర్మ కింద నీకు అనిపిస్తోంది. ధర్మం నువ్వు నిర్వర్తించవలసి వచ్చినప్పుడు అది అశుభకర్మ కింద నీకు కనిపించినా అది చెయ్యవలసిందే రామా అంటాడు. నువ్వు తాటకిని శత్రుత్వంతోటి చంపటంలేదు, కర్తృత్వంతోటి చంపటం లేదు. నీ ధర్మాన్ని నువ్వు ఆచరించటానికి చంపుతున్నావు కాబట్టి నీకు ఏమీ దోషం రాదు తాటకిని చంపు అని విశ్వామిత్రుడు చెప్పాడు. రాముడు చేసే పని విశ్వామిత్రుడు చేయగలడు కానీ నీ శరీరం ఏ పనిమీద వచ్చిందో ఆ పని నీ శరీరం ద్వారా జరగాలి రామా అంటాడు విశ్వామిత్రుడు. రామలక్ష్మణులు రాక్షసులను సంహరిస్తారు. విశ్వామిత్రుడు యజ్ఞం పూర్తి అవుతుంది. తరువాత రామలక్ష్మణులను విశ్వామిత్రుడు మిథిలానగరం తీసుకువెడతాడు. అక్కడ శివధనుస్సు ఉంటుంది. జనక మహారాజు విశ్వామిత్రుడితోటి ఈ శివధనుస్సును ఎవరైతే విరుస్తారో వారికి మా సీతమ్మను ఇచ్చి వివాహం చేస్తాను అని చెబుతాడు. ఆ శివ ధనుస్సును పూర్వం ఎందరో మహారాజులు ఎత్తలేక ఓడిపోయారు. ఆ శివధనుస్సును నేను ఎత్తుతాను అని రాముడు అనలేదు, కామ్‌గా కూర్చున్నాడు. గురువైనటువంటి విశ్వామిత్రుడు ఆ శివధనుస్సును ఎత్తు అని చెప్పినప్పుడు రాముడు ఆ శివధనుస్సును ముట్టుకొనేటప్పటికి అది విరిగిపోయింది. అప్పుడు నీకు సీతమ్మని ఇచ్చి పెళ్ళి చేస్తాను అంటున్నాడు నీకు ఇష్టమేనా అని విశ్వామిత్రుడు అడుగుతాడు. నాకు సీతమ్మ ఇష్టం అని చెప్పలేదు. నా తండ్రిగారికి ఇష్టమయితే నాకు ఇష్టమే అన్నాడు. అదీ రాముడు యొక్క వైభవం. రాముడికి కౌశల్య మీద ఎంత ప్రేమ ఉందో, ఎంత ఆప్యాయత ఉందో సుమిత్ర మీద, కైక మీద కూడా అంతే ప్రేమ, ఆప్యాయత ఉంది. కైక మీద రాముడికి కొంచెము కూడా ద్వేష బుద్ధి కలగలేదు.

సహనం వలన మనం ఏదైనా సాధించవచ్చుగాని, అసహనం వలన ఏదీ సాధించలేము. మీరు ఈశ్వరుడు ప్రీతికోసం పని చేస్తూ ఉంటే ఈశ్వరుడు మీకు మంచి

బుద్ధి కలుగజేస్తాడు. మీరు ఈశ్వరుడు ప్రీతికోసం పనిచేస్తే మిమ్మల్ని బాగుపడమని చెప్పడు కాని మీకు బాగుపడేలక్షణాలు కలుగజేస్తాడు. మీకు బాగుపడే బుద్ధి కలుగజేస్తాడు. మీరు చేసేపని కలిసివచ్చేలా చేస్తాడు అది ఈశ్వరుని దయ. మీకు మంచి తలంపులు వస్తూ ఉంటే, మంచి పనులు చెయ్యాలనే బుద్ధి కలుగుతూ ఉంటే, ఆత్మజ్ఞానం సంపాదించాలనే తపన మీకు కలుగుతూ ఉంటే మీకు ఈశ్వరుని దయ ఉన్నట్టే. భగవాన్ అన్నారు మీరు జపం చెయ్యండి, ధ్యానం చెయ్యండి లేకపోతే శ్వాసమీద ధ్యాస పెట్టండి, నిష్కామకర్మ చెయ్యండి వీటి అన్నింటి యొక్క ప్రయోజనం ఒక్కటే. నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలూకా గ్రహింపు నీ బుద్ధికి అందటానికే ఈ కర్మలు అన్నీ అన్నారు. నిన్ను నువ్వు తెలుసుకోవటానికే. నిన్ను నువ్వు తెలుసుకున్నాక ఏమనిపిస్తుంది అంటే అంతకుముందు నువ్వు చేసిన సాధన చూచి నీకే సిగ్గేస్తుంది. సముద్రంలో ఎంత నీరు ఉందో నీ హృదయంలో అంత ఆనందము ఉంది. ఆ ఆనందము నీకు అనుభవంలోనికి వచ్చాక నిన్ను చూచి నీకే ఆశ్చర్యము వేస్తుంది. మీరు ఆత్మని శరీరం అనుకుంటున్నారు. ఆత్మని మనస్సు అనుకుంటున్నారు, ఆత్మని బుద్ధి అనుకుంటున్నారు, ఆత్మని ప్రాణం అనుకుంటున్నారు. ఇవన్నీ జడవస్తువులు. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. అది చైతన్యము. చైతన్యానికి మించిన వస్తువు కాని, దానికి సమానమైన వస్తువుకాని లేనేలేదు. ఆ చైతన్యం ఎవరోకాదు, అది మీ స్వరూపమే. నీ స్వరూపమే ఆనందం, నీ స్వరూపమే ఉండటం. అది నీకు అనుభవంలోనికి రావటానికే ఈ యజ్ఞాలు. సత్‌కర్మలు నిష్కామంగా చేయటం, అర్చనలు, అభిషేకాలు, ఈ దేవాలయ నిర్మాణాలు ఇవన్నీ నువ్వు ఎవరో నువ్వు తెలుసుకోవటంకోసమే. ఇది రమణ సిద్ధాంతం.

ధర్మాన్ని ఆచరించకుండా మనోనాశనం అవ్వదు. నువ్వు ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే ధర్మం నీ మనస్సుని శుభ్రంగా పిండిచేసి పడేస్తుంది. ధర్మం అంటే దైవం. ఆ దైవమే మీ మనస్సుని నాశనం చేసిపెడుతుంది. మీకు ధర్మాన్ని ఆచరించటం మీద నమ్మకం లేకపోతే నేను ఎవడను అనే విచారణ వల్ల కూడా మీ మనస్సు నశిస్తుంది. ధర్మాన్ని ఆచరించినా మీకు తెలియకుండా మనోనాశనం అయిపోతుంది. మీకు మనోనాశనం కాకుండా ఆత్మానుభవం కలగదు. ఆనందసామ్రాజ్యానికి అధిపతి అవ్వలేరు. మనకి ఆత్మజ్ఞానం రాకుండా అడ్డుపడే బంధాలు 1. రూపము, 2. నామము. ఇవి తప్పించి ఏమీ లేదు. కటికి చీకటి ఈ రూపబుద్ధీ, నామబుద్ధే. ఇవే మనిషిని బంధించేవి, మనస్సుని అంతర్ముఖం కాకుండా చేసేవి. ఈ రూపబుద్ధి, నామబుద్ధి ఉన్నప్పుడు ఆ డార్క్‌నెస్‌లోంచి బయటకు రాలేడు అసలు ఆ

వెలుగును తన కళ్ళతోటి చూడలేడు. మానవుడు ఏ పని చేసినా వాడి రూపబుద్ధి, నామబుద్ధి పెంచుకుంటూ ఉంటాడు. ఒకవేళ మీరు మంచి పనులు చేసినా దాని వెనకాల మీకు ప్రేరణ ఉండేది ధర్మం కాదు. మీరు ధర్మాన్ని ఆచరించటం కోసం చేస్తున్నామని అనుకుంటారు. అనుకునేది ఒకటి, జరిగేది ఒకటి. మీ రూపబుద్ధి, నామబుద్ధి వలన ఆ పని చేయాలని మీకు ప్రేరణ కలుగుతుంది కాని దైవం మటుకు కాదు. ఈ రూపబుద్ధి, నామబుద్ధి ఉన్నంతకాలం మీకు ఆత్మజ్ఞానం కలుగదు.

రాముడు ఎటువంటివాడో మీకు అర్థం అవ్వాలి అంటే భక్తి యోగంలో చివరి 12 శ్లోకాలు చదివితే అవన్నీ రాముడికి ఉన్న గుణాలే. కృష్ణుడు నోటితో చెప్పాడు. రాముడు ఆచరించి చూపాడు.

**అనపేక్ష శ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః**

**సర్వారమ్భ పరిత్యాగీ యోమద్భక్తస్సమే ప్రియః (12-16)**

**అనపేక్ష :-** అపేక్ష ఎలా ఉంటుందో తెలియనివాడు. ఇది భక్తుడి లక్షణం. రాముడు దేనికీ ఎదురుచూడడు. మీరు కూడా మీ పని మీరు చేసుకోండి. మీ ప్రారబ్ధాన్ని బట్టి వచ్చేది వస్తుంది, రానిది రాదు. దేనికోసం ఎదురుచూడకండి. మీరు ఈ భక్తిగుణాలు సంపాదిస్తే మీరు రాముడితోటి సమానం అవుతారు. మానవుడు రాక్షసుడు అవ్వకూడదు, మానవుడు దేవుడు అవ్వటానికే వాల్మీకి రామాయణం రాశాడు. ప్రపంచంలో ఎవడు తప్పు చేసినా మమకారం కోసమే చేస్తాడు. నువ్వు నీ చేతిలో ఉన్న పని శ్రద్ధగా, భక్తిగా చెయ్యి. నీకు ఆ ఫలితం అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు. ఏదీకూడా ఎక్స్‌పెక్టేషన్ పనికిరాదు. ఎక్స్‌పెక్టేషన్ ఉన్నవాడికి డిజప్పాయింట్‌మెంట్ వస్తుంది కాని ఎక్స్‌పెక్టేషన్ లేనివాడికి డిజప్పాయింట్‌మెంట్ లేదు. అందుచేత నువ్వు అపేక్ష లేకుండా పని చెయ్యి అన్నాడు పరమాత్మ.

**శుచిః :-** నీ శరీరం శుచిగా ఉండాలి, నీ మనస్సు శుచిగా ఉండాలి. దేవుడి తరువాత దేవుడితో సమానమైన ప్రాముఖ్యత శుచికి ఉండాలి. నీ శరీరాన్ని ఎంత శుచిగా ఉంచుకుంటావో అలాగ నీ మనస్సు కూడా అంత శుచిగా ఉండాలి. **దక్షః :-** మీరు అమాయకత్వంగా ఉండకూడదు. వ్యవహారాల్లో దక్షతగా ఉండాలి. కొంతమందికి వ్యవహారం ఎలా పరిష్కరించాలో ఆ తెలివితేటలు ఉంటాయి, వాడిని దక్షుడు అంటారు. కొంతమంది డాక్టర్లు సర్జరీ ఎంత బాగా చేస్తారు అంటే అసలు ఆ ముఖం కూడా నలగదు. అంత స్వచ్ఛముగా

చేస్తారు. అందుచేత మీరు చేత్తోటి చేసేపనిలో కూడా దక్షత ఉండాలి. కొంతమంది సమస్యలు వస్తే భయపడతారు. సమస్య వచ్చినప్పుడు మనం ఫేస్ చెయ్యాలి కాని భయపడకూడదు. అది ఎలా పరిష్కరించుకోవాలో దానికున్న తెలివినే దక్షః అన్నారు.

**ఉదాసీనః-** ఎవరైనా ఇద్దరు దెబ్బలాడుకుంటూ ఉంటే వాళ్ళకి ఎందుకు పేచీ వచ్చింది, ఆ పేచీకి కారణం ఏమిటి? ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అది అర్థం చేసుకుని మీరు పరిష్కారం చెయ్యాలికాని, ఏమీ అర్థంచేసుకోకుండా ఎవడో ఒకడి తరపున కలబడి పోవటం తప్పు అని కృష్ణుడు చెబుతున్నాడు. భక్తులు లోకవ్యవహారాలలోకి ఎక్కువ వెళ్ళకూడదు. లోక వ్యవహారాలలోకి ఎక్కువ వెడితే దేహాభిమానం పెరిగిపోతుంది. అతి పనికిరాదు. **గతవ్యధః-** మీరు అస్తమానూ జరిగిపోయిన గొడవలు తలపెట్టుకుని బాధపడితే మీకు సుఖం లేదు. మీ చేతిలో ఉన్న వర్తమానకాలం వెళ్ళిపోతుంది. మీరు సాధన వర్తమానకాలంలో చెయ్యాలి. మీరు వర్తమానకాలంలోనే బాగుపడాలి. ఈ వర్తమానకాలం వదిలేసి అస్తమానూ జరిగిపోయిన గొడవలు తలపెట్టుకుని ఏడుస్తూ కూర్చోకండి మీరు పాడైపోతారు అని భగవంతుడు చెబుతున్నాడు. **సర్వఆరంభపరిత్యాగీ:-** మీరు ఏ పని చేసినా కర్తృత్వం లేకుండా, అహంకారం లేకుండా, రాగద్వేషాలు లేకుండా, వ్యక్తిభావన లేకుండా పని చెయ్యండి. అది మిమ్మల్ని అంటదు. అది మీ పునర్జన్మకు కారణం అవ్వదు.

రాముడు మితభాషి, హితభాషి, ప్రియభాషి. రాముడు పూర్వభాషి కూడా అన్నాడు వాల్మీకి అంటే ఎదుటి వాళ్ళు పలకరించకుండా ముందు రాముడు పలకరిస్తాడు. మనం ఏమి చేస్తామంటే ఎదుటి వాళ్ళు పలకరించకుండా ముందు మనం పలకరించము. వాళ్ళకు ఏమీ తెలియదు అనుకుంటాము ఎందుకంటే మనకు ఏమీ తెలియదు కాబట్టి అన్నీ తెలుసును అనుకుంటాము. సోక్రటీసుని మీకు ఆశ్రమం లేకపోయినా మిమ్మల్ని చూడటానికి చాలామంది ఎందుకు వస్తున్నారు అని ఒకరు అడిగారు. సోక్రటీసు ఏమని చెప్పాడంటే నాకు ఏమీ తెలియదు. నాకు ఏమీ తెలియదు అన్న సంగతి కూడా నాకు తెలుసు. అందుకు నన్ను చూడటానికి అందరూ వస్తున్నారని సోక్రటీసు చెప్పాడు. ఎక్కువ మంచితనం ఉంటే లోకం భరించలేదు. అబ్రహాంలింకన్‌ని కాల్చి చంపింది, మహాత్మాగాంధీని కాల్చి చంపారు, సోక్రటీసుని విషం పెట్టిచంపారు. సోక్రటీస్‌కి ఇంకో గంటకి విషం పెడతారనగా ఈ భక్తులు అందరూ వెళ్ళి ఆ జైలు తలుపులు కొట్టేసి సోక్రటీసుతో మనం పారిపోదాం అంటారు. వాళ్ళు విషం

పెట్టి చంపుతున్నారు అనుకోనక్కరలేదు నాకు చనిపోయే టైము వచ్చింది కాబట్టి ఈశ్వర సంకల్పం ప్రకారం నేను చనిపోతున్నాను. మీరు ఇంకా కొంతకాలం ఈ భూమి మీద బతకవలసి ఉంది, మీరు సుఖంగా బతకండి అని సోక్రటీసు చెప్పాడు.

ప్రతీమనిషికి శత్రువులు ఉంటారు, మిత్రులు ఉంటారు కొంతమంది మన క్షేమం కోరేవాళ్ళు ఉంటారు, కొంతమంది మన పతనం కోరేవాళ్ళు ఉంటారు. ఇది సహజం, ఇది ప్రకృతి. కానీ మీకు బయట ఉన్న శత్రువుల వల్ల పెద్ద ప్రమాదంలేదు. మీకు లోపల ఉన్న శత్రువుల వల్లే ఎక్కువ ప్రమాదం. కామ, క్రోధ, లోభ, మద, మోహ, మాత్సర్యాలు ఇవి అందరి మనస్సులో ఉన్నాయి. ఇవి మన లోపల ఉన్న శత్రువులు. మీకు లోపల ఉన్న శత్రువులు తీసుకువచ్చినంత ప్రమాదంలో వందో వంతు కూడా బయటి శత్రువులు తీసుకురాలేరు అని భగవంతుడు చెప్పాడు. లోపలి శత్రువులే మిమ్మల్ని జన్మజన్మలకీ పీడించేస్తున్నాయి లోపల శత్రువులను మీరు జయిస్తే అసలు బయట శత్రువు అనేవాడు మీకు కనబడడు. **తుల్యనిందిస్తుతిర్మేనీ** :- కొంతమంది నిన్ను పొగుడుతూ ఉంటారు, కొంతమంది నిన్ను విమర్శిస్తూ ఉంటారు. ఆ మాటలను నువ్వు లోపలకు తీసుకోవద్దు. బయట గొడవలు బయట వదిలేయమని పరమాత్మ చెబుతున్నాడు. విమర్శలకు కారణం అసూయ. మనల్ని పొగడటం వలన మనకి వచ్చేది ఏమీ లేదు. విమర్శించటం వలన ఉన్నది ఏమీ పోదు. నిన్ను పొగిడేవాళ్ళు పొగుడుతూ ఉంటారు, తిట్టేవాళ్ళు తిడుతూ ఉంటారు. ఇది లోకం. లోకం అంటే కుక్క తోక లాంటిది. అవేమీ నువ్వు పట్టించుకోవద్దు. **స్థిరమతి :-** బుద్ధి స్థిరంగా ఉండాలి. కొంతమంది రోజుకో రకంగా ఉంటారు. వాళ్ళు ఏమి మాట్లాడుతున్నారో వాళ్ళకే తెలియదు. రోజుకోరకంగా ఉండకండి అంటే ఎటు గాలి వీస్తే అటు వెళ్ళిపోయేటట్టు ఉండకూడదు. బుద్ధి నిర్మలంగా ఉండాలి, బుద్ధి నిదానంగా ఉండాలి. మిమ్మల్ని ఎవరో బాగుచేస్తారు అనుకుంటున్నారు, మిమ్మల్ని ఎవరూ బాగు చేయరు. మీ బుద్ధే మిమ్మల్ని బాగు చేస్తుంది, మీ బుద్ధే మిమ్మల్ని పాడు చేస్తుంది. అందుచేత మీ బుద్ధి విషయంలో అజాగ్రత్తగా ఉండకండి. స్థిరబుద్ధి సంపాదించుకోండి. ఏ వస్తువు మీద అయితే మీ బుద్ధిని నిలబెట్టారో అక్కడ మీ బుద్ధి నిలబడి ఉండాలి. బుద్ధి చలించకూడదు. బుద్ధికి జ్ఞాపకశక్తి పెరగాలి కాని జ్ఞాపకశక్తి తగ్గకూడదు. మీరు మంచి విషయాలు శ్రవణం చేసి అవి మర్చిపోకుండా మీ బుద్ధిలో మననం చేసుకోవాలి. మీ శరీర ఆరోగ్యానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నారో మీ బుద్ధికి కూడా అంతే ప్రాముఖ్యత ఇవ్వండి. మీకు బుద్ధి నిర్మలంగా ఉండాలంటే

రెండే మార్గాలు. 1 నిరంతరం దైవధ్యానం, 2 నిరంతరం ఆత్మధ్యానం. ఆత్మ అంటే చైతన్యము. చైతన్యానికి రూపంలేదు. నిరంతరం ఆత్మని ధ్యానించటం వలన బుద్ధి నిర్మలం అవుతుంది. దైవాన్ని అంటే రాముడినో, కృష్ణుడినో నిరంతరం ధ్యానించటం వలన కూడా బుద్ధి నిర్మలమవుతుంది. మీకు ఏమార్గం ఇష్టం అయితే ఆ మార్గంలో ప్రయాణం చేసి తరించండి.

రామనామ స్మరణ చేసుకునేవాడు పవిత్రుడు అవుతాడు. పరమపవిత్రుడు కాని వాడికి ఆత్మజ్ఞానం కలగదు. రాముడు అంటే రంజింప చేసేవాడు, రాముడు అంటే జ్ఞాన స్వరూపుడు. మీరు రామనామం చేసుకుంటే రాముడు మనకి ధనాన్ని ఇస్తాడు, గుణాన్ని ఇస్తాడు. ఆ ధనాన్ని, గుణాన్ని సద్వినియోగం చేసుకుంటే జ్ఞానాన్ని ఇస్తాడు. రాముడు సర్వ సమర్థుడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-03-2011, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వేదముల యొక్క సారమే భగవద్గీత. భగవద్గీత మీ జేబులో ఉంటే నాలుగు వేదములు మీ దగ్గర ఉన్నట్లే. భగవద్గీత సమగ్రమైన గ్రంథం. మనం చైతన్యస్థాయిని అందుకోవటానికి అన్ని కోణాల్లోంచి భగవద్గీతలో ప్రతిపాదనలు ఉన్నాయి. మమ్మల్ని భగవద్గీత ఎప్పుడైనా చదవమంటారా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. ఎప్పుడైనా కాదు, మీకు అవకాశం ఉంటే ఎప్పుడూ చదువుకోండి అన్నారు. మన హిందువులు ఎక్కువగా భగవద్గీత పారాయణ చేస్తారు. మనం చెయ్యవలసిన పనులు, చెయ్యకూడని పనులు గురించి గీతలో వివరంగా చెప్పారు. మనం ఎలాగ మాట్లాడాలి, మనం ఎలాగ పనిచేస్తే మనకి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం అలవడుతుందో ఇవన్నీ గీతలో ప్రతిపాదించారు. నీచేతిలో ఉన్న పని నువ్వు చెయ్యాలి. ఆ పని జరగవచ్చు, జరగకపోవచ్చు. జరిగిందని సంతోషపడకూడదు. ఆపని జరగలేదని మనం డిప్రెషన్‌లోనికి వెళ్ళకూడదు. ఆపని అలా జరగకపోవటానికి కారణం కేవలం మన సోమరితనం కాదు, మన తెలివితక్కువతనం కాదు, మనం కష్టపడి పనిచేసినా, డెడికేటెడ్‌గా పనిచేసినా ఒకోసారి రిజల్ట్ మనకి అనుకూలంగారాదు. ఒకోసారి ఆ పని జరిగినా మన తెలివితేటల వలన జరగలేదు. అది భగవంతుడి సంకల్పాన్ని బట్టి అలా జరిగింది. నేను తెలివైన వాడిని, నేను తెలివితక్కువ వాడిని, నేను అది సాధించాను, ఇది సాధించాను, అది సాధించలేకపోయాను, ఇది సాధించలేకపోయాను అని నువ్వు అనుకుంటున్నావు అంటే భగవంతుడి సంకల్పానికి భిన్నంగా నువ్వు ఏదో చెయ్యాలని అనుకుంటున్నావు. అది

ఒకరకమైన దురాలోచన అన్నాడు పరమాత్మ. భగవంతుడి సంకల్పం బలీయమైనది. భగవంతుడి సంకల్పాన్ని మనం అంగీకరించకపోతే మనకి దుఃఖం వస్తుంది. పని జరిగినా, జరగకపోయినా భగవంతుడి సంకల్పం అలా ఉంది అనుకుంటే మీకు ఎవరికీ దుఃఖంరాదు. ఈశ్వర సంకల్పం ఎలా ఉన్నా నీ డ్యూటీ నువ్వు చెయ్యాలి. నీ డ్యూటీ నువ్వు చెయ్యకపోతే నీకు సోమరితనం వస్తుంది. భగవంతుడికి భిన్నంగా అసలు నువ్వు లేవు. నువ్వు భగవంతుడికి భిన్నంగా ఉన్నాను అనుకుంటున్నావు. ఆ దురాలోచన వల్లే నీకు దుఃఖం వస్తోంది.

ప్రపంచంలో ఉన్న మాయలో డబ్బు మాయ ఒకటి. డబ్బు సంపాదించేవాడికి ఇంక సంతృప్తి ఉండదు. డబ్బుపిచ్చి ఉన్నవారు లక్ష్మీదేవిని ప్రార్థిస్తారు. చదువు పిచ్చి ఉన్నవాళ్ళు సరస్వతీ దేవిని ప్రార్థిస్తారు. అవి రెండూ ప్రకృతి గొడవలే, అవి మోక్షానికి దారి చూపించవు అని గౌడీయ మఠం వాళ్ళు చెబుతారు. మేము రాధాకృష్ణులని ఎందుకు ప్రేమిస్తాము అంటే రాధయొక్క ఇంద్రియాలు, మనస్సు అన్నీ కృష్ణుడి మీదే కేంద్రీకృతం అయిఉంటాయి. మనం రాధని స్మరించటం వలన మనకి డబ్బుపిచ్చిపట్టుకోదు, చదువుపిచ్చీ పట్టుకోదు, పరమాత్మని ఎలా పొందాలి, పరమాత్మలో ఎలా ఐక్యం అవ్వాలి అనే దానికి రాధ మనకు ఆదర్శం. రాధయొక్క ప్రేమ మన చేత పరమాత్మని పొందింపచేస్తుంది, అందుచేత మేము రాధని ప్రేమిస్తాము అని హరేకృష్ణా వాళ్ళు చెబుతారు. రాధకు కృష్ణుడి మీద ఉన్న ప్రేమ వ్యాపారం కాదు. అది అలౌకిక ప్రేమ, అభౌతికమైన ప్రేమ. రాధయొక్క ప్రేమ పరమాత్మ మీద ఉంది. అలా పరమాత్మని ప్రేమిస్తూ ఉంటే సహజంగానే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వచ్చేస్తుంది. అప్పుడు ఇంక విషయచింతన ఆగిపోతుంది. అదీ రాధ యొక్క ప్రేమ. ఆ ప్రేమలో క్వాలిటీ ఉంటుంది. ఆ ప్రేమ శరీరానికి కాని, ఇంద్రియాలకు కాని, మనస్సుకు కాని సంబంధించినది కాదు. ఆ ప్రేమవల్ల నువ్వు పరమాత్మలో ఐక్యమవుతావు. కృష్ణస్మరణ చేసి రాధ ఆకృష్ణుడిలో ఎలా ఐక్యమయ్యిందో అలాగే మనం కూడా ఆ పరమాత్మలో ఐక్యం కావాలని ఎగ్జాంపుల్ కోసం రాధే చైతన్యుడిగా వచ్చి పూరీ జగన్నాధస్వామిలో ఐక్యమయ్యింది. శ్రీకృష్ణచైతన్యుడు గొప్ప ఇంద్రియనిగ్రహం గలవాడు. పంచదార ఆయన నాలుక మీద వేస్తే పంచదార ఒక కణంకూడా తడి అవ్వదు అటువంటి నిగ్రహం కలవాడు. తత్వం మీద మీకు శ్రద్ధ కలిగినా ఇంద్రియనిగ్రహం మనోనిగ్రహం మీకు సహజంగానే వచ్చేస్తాయి.

మనకి సత్సంగాలు దేనికోసం అంటే మనలో ఉన్న అజ్ఞానం అనే చీకటి పోవటం కోసం. మనం ఒక చీకటి గదిని చూశాము అనుకోండి. ఆ గదిలో మనం వెలుతురు

చూడాలంటే లైటు వేసుకోవాలి. మనకి వెలుతురు అక్కరలేకపోతే లైటు వేసుకోనక్కరలేదు. అలాగే మనం ఏ అజ్ఞానంలో ఉన్నామో ఆ అజ్ఞానంలో మనం ఉండిపోవాలి అనుకుంటే సత్సంగాలు అక్కరలేదు. చీకటి గదిలో లైటు వేస్తే ఆ లైటు గదికి ఎలా వెలుగుని ఇస్తుందో అలాగ మన హృదయంలో ఉన్న అజ్ఞానాన్ని పోగొట్టి అక్కడ కాంతిమయం చేయటమే సత్సంగాలయొక్క ప్రయోజనం, కాని భౌతికమైన ప్రయోజనం ఏమీలేదు.

బృందావనంలో ఎక్కడ ఏ సంఘటన జరిగిందీ ఎవరికీ తెలియదు. శ్రీకృష్ణచైతన్యుడు బృందావనం వచ్చి ఆ మట్టి వాసన చూచి ఇక్కడ కృష్ణుడు గోవర్ధనపర్వతాన్ని ఎత్తాడు. ఇక్కడ కాళీయమర్దన చేశాడు, ఇక్కడ రాసలీలలు చేశాడు అని ఆ ప్రదేశాన్ని ఐడెంటిఫై చేసినవాడు శ్రీకృష్ణచైతన్యుడు. ఆయన వచ్చిన తరువాతే బృందావనానికి వికాసం వచ్చింది. చైతన్యుడు బృందావనం వెళ్ళి చూసి వచ్చేవాడు కాని అక్కడ ఉండేవాడు కాదు. పూరీలో ఉండిపోయేవాడు. చైతన్యుడిది ఎక్కువ నామ సిద్ధాంతం. శ్రీకృష్ణచైతన్యుడు ఎక్కువ కృష్ణ నామం చేస్తూ ఉండేవాడు. కలియుగంలో బుద్ధిలో దోషాలు ఎక్కువ ఉంటాయి, మనుషులు కుదురుగా ఉండరు, ఉన్నవాళ్ళూ ఏడుస్తూ ఉంటారు, లేనివాళ్ళు ఏడుస్తూ ఉంటారు, ఇక్కడ తరించటానికి ఏదైనా మంత్రం చెప్పమని నారదుడు బ్రహ్మదేవుడిని అడిగారు. అప్పుడు బ్రహ్మదేవుడు హరేరామ హరేరామ, రామరామ హరేహరే, హరేకృష్ణ హరేకృష్ణ, కృష్ణకృష్ణహరేహరే అని ఈ మంత్రం మంచిది. కలియుగంలో ఇది చేసుకోండి అని బ్రహ్మదేవుడు నారదుడికి చెప్పాడు. చైతన్యుడికి కులభేదం లేదు. ఆయన బ్రాహ్మణుడు, మహాపండితుడు, వ్యాకరణ శాస్త్రవేత్తకూడా. హరేరామ, హరేరామ, రామరామహరేహరే, హరేకృష్ణ, హరేకృష్ణ, కృష్ణకృష్ణ హరేహరే అని చైతన్యుడు ప్రజల్లో ప్రచారం చేసేవాడు. అప్పుడు బ్రాహ్మణులు ఆయనకు ఎదురు తిరిగారు. ఆ మంత్రం బ్రాహ్మణులే చెయ్యాలి ఇది సాంప్రదాయం, వెనుకబడిన కులాలు చెయ్యటానికి వీలులేదు. నువ్వు ఇతర కులాలకు కూడా వెళ్ళి ఈ మంత్రాన్ని ప్రచారం చేస్తున్నావు, ఇది నీకు తగదు అని చైతన్యుడి మీద పేచీలు మొదలు పెట్టారు. వెనుకబడిన వర్గాలు కూడా జీవులే, స్త్రీలుకూడా జీవులే వాళ్ళుకూడా తరించాలి. నేను సాంప్రదాయాన్ని వదిలేస్తున్నాను. మీరు నా తోటి పేచీకి రాకండి అన్నాడు. నేను ఒక ఉపాయం చెబుతున్నాను. బ్రహ్మదేవుడు హరేరామ, హరేరామ అని మొదలుపెట్టి చెప్పాడు. నేను దానిని తిరగేసి హరేకృష్ణ, హరేకృష్ణ అని మొదలుపెట్టి చెబుతాను అన్నాడు చైతన్యుడు. నువ్వు చెప్పినట్టు చేస్తే ఎవరికీ ఫలితం రాదులే చేసుకో అన్నారు సాంప్రదాయవాదులు. దీనిగురించి శ్రీకృష్ణచైతన్యుడిని కొంతమంది అపార్థం చేసుకుంటున్నారు కాని కొన్ని కులాలవారు

చైతన్యుడి మీద దాడి చేస్తే అప్పడు ఈ మంత్రం మార్చాడు. తుకారామ్, నామదేవుడు, ఏకనాధుడు ఇలా అనేకమంది భక్తులు భక్తిమార్గంలో నామం చేసి తరించారు.

భగవద్గీత మీకు అర్థం అవ్వటంలేదని కంగారుపడకండి. యింద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేకుండా మీరు భగవద్గీత చదవవచ్చు, చదివినా మీకు భగవద్గీత అర్థంకాదు. ఇంద్రియాలకి, మనస్సుకి అతీతంగా వెడితే కొన్ని విషయాలు మీకు అర్థం అవుతాయి. నువ్వు ఇంద్రియాల్లోంచి, మనస్సులోంచి విడుదల పొందితేనే నీకు సత్యం తెలుస్తుంది. నీ ఇంద్రియాలకి, నీమనస్సుకీ తెలిసినవే శాస్త్రంలో చెబితే ఇంక శాస్త్రం ఎందుకు? మీకు ఏ విషయంమీద అయితే ఎక్కువ మోహం ఉందో ఆ విషయం గురించే శాస్త్రంలో చెబితే అది శాస్త్రం ఎలా అవుతుంది? నీకు నచ్చినా నచ్చక పోయినా దేహానికి అతీతంగా, మనస్సుకి అతీతంగా, ఇంద్రియాలకి అతీతంగా, ప్రపంచానికి అతీతంగా నిన్ను తీసుకు వెళ్ళే వాక్యాలు పరమాత్మ చెప్పాడు. అదే భగవద్గీత. నామం నిరంతరం చేయటం వలన నీకు అక్కరలేని తలంపులు అన్నీ ఆగిపోతాయి. రమణమహర్షి శరీరాన్ని చూచి ఆయన గురువు అనుకుంటాము, మనం ఆయన భక్తులం అనుకుంటాము. అప్పడు మనకి ముందు స్థూలసంబంధం ఏర్పడుతుంది. అలాగ స్థూలంగా ఆరూపాన్ని, ఆ నామాన్ని జపించగా, జపించగా స్థూల సంబంధం పోయి మన మనస్సు అంతర్ముఖమయ్యి అప్పడు సూక్ష్మ సంబంధం ఏర్పడుతుంది. అప్పడు గురువు శరీరం కనిపించినా, కనిపించకపోయినా ఒక్కటే. ఇప్పడు భగవాన్ శరీరం కనిపిస్తోందా? కనిపించటం లేదు, అలాగని ఆయన మీద మనకి భక్తి లేకుండా ఉన్నామా? మనకి ఆయన మీద భక్తి ఉంది. మన శరీరం చనిపోయినప్పడు అందరితోటి సంబంధాలు తెగిపోతాయి, పరిసరాలుతోటి కూడా సంబంధం తెగిపోతుంది కాని గురువుతోటి ఉన్న సూక్ష్మసంబంధం తెగదు. అది జ్ఞాపకం పెట్టుకోండి. గురువుతోటి ఉన్న సంబంధం ఎప్పటివరకు తెగదు అంటే ఆయన వేరు, నేను వేరు అనే బేధబుద్ధి కంప్లీటుగా పోయిన తరువాత, సత్యంతోటి నీకు వన్‌నెస్ వచ్చిన తరువాత అప్పడు గురువుతోటి ఉన్న సూక్ష్మసంబంధం తెగిపోతుంది, కాని అప్పటివరకూ సూక్ష్మ సంబంధం నీకు తెగదు.

మీకు నిద్దట్లో ఎక్కడైనా దుఃఖం ఉందా? అక్కడ దుఃఖం లేదు. మీకు తలంపు వచ్చిన తరువాత దుఃఖం వస్తోంది. అంటే దుఃఖం తలంపు రూపంలో ఉంది. మీరు నామాన్ని శ్రద్ధగా చేయగా, చేయగా ఆ నామం ఏమి చేస్తుంది అంటే చెడ్డ తలంపులని తరిమి వేస్తుంది. అప్పడు మీరు నిజస్థితిలోకి వెళ్ళటానికి ఆ నామం సహకరిస్తుంది. మనం

ముందు శాస్త్రాన్ని నమ్మాలి. లేకపోతే సాధన చేయలేము. మీకు సంతోషం కలిగించే తలంపులు వస్తే రండి, రండి అంటున్నారు. మీకు దుఃఖం కలిగించే తలంపులు వస్తే వద్దు, వద్దు అంటున్నారు. సంతోషం కలిగించే తలంపులు కూడా భవిష్యత్తులో మీకు దుఃఖాన్ని తీసుకువస్తాయని తెలియకపోవటం వలన వాటిని రమ్మంటున్నారు, ఎవ్విరితాట్ ఈజ్ సారోఫుల్. ప్రకృతిలోంచి మీరు ఏ ప్లెజరు తీసుకున్నా పరిణామంలో ఏదొక రోజున పెయిన్ కింద మారిపోతుంది. జప, ధ్యానములు ఎందుకు చెప్పారు అంటే, నువ్వు ఒక రూపంతోటి నామంతోటి తాదాత్మ్యం పొందుతున్నావు. నీ రూపబుద్ధిని బట్టి, నీ నామబుద్ధినిబట్టి చైతన్యానికంటే నేను భిన్నంగా ఉన్నాను అనుకుంటున్నావు. మీ హృదయంలో ఒకనిజం ఉంది. ఆ నిజం వైపుకి దారి చూపించి నిజంలో స్థిరపడేటట్టు చేయటానికే ఈ జపము, ధ్యానము. మేము రోజూ జపాలు చేసుకోవటం, తపస్సు చేసుకోవటం ఇదే పనా? దీనికి ముగింపులేదా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. నువ్వు జపం ఎంత వరకు చెయ్యాలి అంటే నీకు ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఎంత సహజంగా జరుగుతున్నాయో అంత సహజంగా నామం జరిగే వరకూ చేస్తే సరిపోతుంది. నీకు నామం సహజమవ్వాలి. రాత్రి ఒంటిగంటకు ఎవరైనా నిన్ను లేపారనుకో అప్పుడు నీకు నారాయణ స్మరణ జరుగుతూ ఉండాలి. నీ హృదయంలో ఒక వస్తువు సహజంగా ఉంది, నార్మల్‌గా ఉంది. నువ్వు అంత నార్మల్‌గా జపం చేయకలుగుతూ ఉంటే, అంత సహజంగా ధ్యానం చేయకలుగుతూ ఉంటే అప్పుడు లోపల ఉన్న సద్వస్తువు నీకు వ్యక్తమవుతుంది. ఆ సద్వస్తువు వ్యక్తమైన తరువాత జపం చేసే జపి కనబడడు. అప్పుడు నీకు ఆత్మసాక్షాత్కారం అవుతుంది.

మీరు దైనందిన జీవితంలో ఇంద్రియాలని, మనస్సుని దేహబుద్ధి తగ్గటానికి ఉపయోగించుకోవాలి. దేహబుద్ధి తగ్గటానికి మేగ్జిమమ్ వాటిని ఉపయోగించుకుంటే ఈ శరీరం ఉండగానే మీకు ఆత్మబుద్ధి కలుగుతుంది. మీరు ఎవరికైనా ఉపకారం చేసారనుకోండి వారికి మీ పట్ల కృతజ్ఞత లేదు అనుకోండి మీకు ఏమీ నష్టం లేదు మీరు భగవంతుడి అనుగ్రహానికి పాత్రులవుతారు. చాలామంది ఏమంటారు అంటే మేము వాళ్ళకి చాలా ఉపకారం చేసాము, వాళ్ళు అంతా మరచిపోయారు అంటారు. ఈ జీవుడు కాదు కదా మీకు మోక్షం ఇచ్చేది. మీరు చేసిన సెల్ఫ్‌లెస్ వర్క్ భగవంతుడి దయకి మిమ్మల్ని పాత్రుల్ని చేస్తుంది. మీరు పవిత్రులవుతారు. అందరికీ ఉన్న చెడ్డ ఏమిటి అంటే గుర్తింపులు కోరుకోవటం. ఇతరులచేత మనం గుర్తింపబడటం అనేది మనస్సుకి ఫుడ్. అది దేహబుద్ధిని

పెంచేస్తుంది. ఆ పని చెయ్యమని భగవంతుడు చెప్పాడు కాబట్టి నువ్వు పని చేస్తున్నావు అంతే నీకు గుర్తింపులు అక్కరలేదు అనుకో అంటే మన ఇంద్రియాలు, మన మనస్సు భగవంతుడు చెప్పిన ప్రకారం వర్కు చేస్తున్నాయి అనుకోండి ఇంక మనం ప్రత్యేకంగా కష్టపడనక్కరలేదు స్లోగా దైనందిన జీవితవిధానంలో దేహబుద్ధి పడిపోతుంది, దైవబుద్ధి కలుగుతుంది. అప్పుడు చావు పుట్టుకలతోటి సంబంధంలేదు. ఇంక గోయింగులేదు, కమింగులేదు. అటువంటి అద్వైతానుభవం మీకు తీసుకురావటానికే, ఏదైతే ఎప్పుడూ ఉందో అక్కడికి మిమ్మల్ని తీసుకువెళ్ళటానికే శాస్త్రం ప్రయత్నం చేస్తోంది. అది మీ అనుభవానికి విరుద్ధంగా ఉంది కాబట్టి మన మనస్సు శాస్త్రాన్ని అంగీకరించనివ్వదు. ఎందుచేతనంటే మీలో ఉన్న పవిత్రత సరిపోదు, ఏకాగ్రత సరిపోదు. ఎంతోకొంత సెల్ఫ్‌లెస్ వర్క్ చేయటం వలన భగవంతుడిని తెలుసుకోవటానికి మీ మైండు స్లోగా ప్రిపేర్ అవుతూ ఉంటుంది.

జ్ఞానం అంటే చాలా కష్టం అనుకోకండి. మీ రూపబుద్ధి, నామబుద్ధే చైతన్యానికంటే మనం భిన్నంగా ఉన్నాము అని అనిపింపచేస్తుంది. అక్కడనుంచి మనకి సఫరింగ్ ప్రారంభమవుతుంది. చెట్టు నుండి కొబ్బరికాయ రాలినట్టు నీలోంచి రూపబుద్ధి, నామబుద్ధి రాలిపోతే ఇంక జపంతోటి, తపస్సుతోటి నీకు పని ఏమిటి? మనకి భగవంతుడితోటి సెపరేటెనెస్ ఉన్నట్టు తెలుస్తోంది కదా! ఆ సెపరేట్‌నెస్ మనకి పోవాలి. శ్రీకృష్ణచైతన్యుడు, శ్రీకృష్ణుడికోసం ఎలా తపించాడో అలా తపిస్తే మనకి సెపరేట్‌నెస్ పోతుందని చైతన్యుడి అవతారం వచ్చింది. మీకు ఏ విషయంలోంచి దుఃఖం వస్తున్నప్పటికీ, ఏ సందర్భంలో అశాంతి వచ్చినప్పటికీ అక్కడ జ్ఞానం లేదని అర్థం. భగవంతుడు సంకల్పాన్ని మీరు అంగీకరించలేకపోతున్నారు. భగవంతుడు వేరు, మనం వేరు అనుకోవటం వలన ఆయన సంకల్పాన్ని యాక్సెప్ట్ చేయలేకపోతున్నాము, రిజెక్టు చేస్తున్నాము. అక్కడ నుండి దుఃఖం ప్రారంభమవుతుంది. డాక్టరుగారి దగ్గరికి పేషెంటు ఎందుకు వెడతాడు? డాక్టరుగారికి ఎన్ని డిగ్రీలు ఉన్నాయో పేషెంటుకి అక్కరలేదు, డాక్టరుగారు ఎక్కడ చదువుకున్నారో పేషెంటుకి అక్కరలేదు పేషెంటుకి రోగం తగ్గాలి. డాక్టరుగారు పని పేషెంటు ఏ రోగంతో వచ్చాడో ఆ రోగాన్ని తగ్గించి పంపాలి. అలాగే మేము చెప్పే ఈ ప్రవచనాలు మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకువెడితేనే మా ప్రసంగాల యొక్క ప్రయోజనం. మేము ఎర్రబట్టలు కట్టుకున్నామా? తెల్ల బట్టలు కట్టుకున్నామా? మీకు అనవసరం. గృహస్థాశ్రమంలో ఉన్నా కర్మఫల త్యాగి సన్యాసి అని పరమాత్మ చెప్పాడు. మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి మేము తీసుకువెళ్ళకలిగితే

మేము ఏ బట్టలు కట్టుకున్నా ఒకటే. మీకు అనేక కారణాల వల్ల దుఃఖం రావచ్చు. ఏ కారణం వలన దుఃఖం వచ్చినా అక్కడ అజ్ఞానం ఉందని అర్థం. గురువుకి ఉండవలసిన లక్షణాలు ఏమిటి అంటే గురువు ఏదైనా విషయాన్ని ఆలోచించేటప్పుడు లోతుగా ఆలోచించాలి ఆలోచించిన విషయాన్ని చెప్పేటప్పుడు ఇతరులకి అర్థమయ్యేలాగ తేలిక మాటలతోటి చెప్పాలి.

భగవాన్ ఏమన్నారు అంటే మీకు ఏదైనా సంతోషం వస్తోంది అనుకోండి ఈ సంతోషించే నేను ఎవరు? మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, ఈ దుఃఖపడే నేను ఎవరు? అని ఎక్కడికక్కడ ప్రశ్నించుకొని దానిని కత్తిరించేయండి. అప్పుడు మీ మనస్సుకి అంతర్ముఖం కలుగుతుంది. అంతర్ముఖం అయిన మనస్సు హృదయంలో లయమైపోతుంది. అంటే ఈ ఫాల్స్ ఐ హృదయంలో ఉన్న ట్రూత్‌ని చూడగలిగితే ఇది డిజప్పియర్ అయిపోతుంది. మీకు ఇష్టంలేని వాళ్ళు ఎవరైనా స్కూటరు మీద నుండి పడిపోయారు అనుకోండి మీకు సంతోషం వస్తుంది, వాళ్ళకి రెండు కాళ్ళు విరిగిపోయాయి అనుకోండి మీకు ఇంకా సంతోషం వచ్చేస్తుంది, సంతోషం ఎందుకు వస్తుంది అంటే వాడి మీద మీకు ద్వేషం ఉంది. వాడిమీద ఉన్న ద్వేషం మీకు నెరవేరింది. ఆ వార్త వినపడగానే మీ మనస్సు లోపలికి వెళ్ళికొంత శాంతిని పీల్చుకుని మళ్ళీ సహస్రారానికి వచ్చేస్తుంది. అప్పుడు కూడా శాంతి హృదయంలోంచే వస్తుంది. అది ఒకరోజో రెండు రోజులో ఉంటుంది. మరల అశాంతి వచ్చేస్తుంది. అందుచేత ప్రతీ మనిషి సత్యాన్వేషకుడిగా ఉండాలి, భక్తులు అందరికీ సత్యం రివీల్ అవ్వదు. సత్యాన్ని ఎవరైతే ప్రేమిస్తున్నారో, ఎవరైతే సత్యాన్వేషకుడిగా ఉన్నారో వారికి మాత్రమే సత్యం తెలియబడుతుంది. శాంత చిత్తము గలవాడు సత్యాన్వేషకుడు అవుతాడు. ఒకడికి అనుకూలమైన ఉద్యోగం దొరికితే, వాడికి అనుకూలమైన భార్య దొరికితే, వాడికి పరిస్థితులు అన్నీ అనుకూలంగా ఉంటే లోకంలో వాడిని అదృష్టవంతుడు అని అనుకుంటారు. కానీ వీళ్ళందరికంటే శాంత చిత్తము కలవారు అదృష్టవంతులు. ఉపనిషత్తులో ఏమని చెప్పారంటే సత్యము ఎవరినైతే ఎన్నుకుందో వాడికే తెలియబడుతుంది కాని సత్యం ఇతరులకు తెలియబడదు అని చెప్పారు. మనకి సాధన లేదు అనుకోండి ఏమీ కృషి లేదు అనుకోండి, సత్యాన్వేషణ కోసం మనకి తపన లేదు అనుకోండి వందేళ్ళు బతికినా ప్రయోజనం ఏముంది? ఇవాళ తిన్న అన్నమే రేపు తింటున్నాము. ఇంక ప్రయోజనం ఏముంది? మనకి అంతర్దృష్టి లేనప్పుడు మనకు సత్యాన్వేషణ లేనప్పుడు వంద సంవత్సరాలు బతికినా ప్రయోజనం లేదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-04-2011, ముమ్మిడివరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ ముమ్మిడివరం గ్రామం చాలా ప్రాచీనమైన గ్రామం. ఇక్కడ ఉన్న శివాలయం కూడా చాలా ప్రాచీనమైన దేవాలయం, ఇది సూర్యభగవానుడిచేత స్థాపించబడినది. ప్రజాసేవ అందరూ చేయలేరు, అది చాలా కష్టంతో కూడినది. గాడ్ హేజ్ క్రియేటెడ్ సమ్ సోల్స్ టు లివ్ ఫర్ అదర్స్ ఓన్లీ అని వేదంలో చెప్పాడు. కొంతమంది వారిపొట్టకోసం, వారి కుటుంబం కోసమే జీవిస్తారు, ఇంక దేని గురించి ఆలోచించరు. కాని కొంతమంది ఎలా ఉంటారు అంటే వారి కుటుంబంకోసం ఎలా కష్టపడుతున్నారో అలాగ సమాజ శ్రేయస్సు కోసం కూడా కష్టపడి పని చేస్తారు, అలా పనిచేసే వారు కొద్దిమంది మాత్రమే ఉంటారు. లౌకికమైన ప్రయోజనం ఆశించకుండా పని పని కోసమే చేస్తూ ఉంటే, సమాజరూపంలో ఉన్న భగవంతుడిని ఆరాధిస్తూ ఉంటే వారికి వ్యక్తిభావన తగ్గిపోతుంది, దేహభావన తగ్గిపోతుంది, లోకవాసన తగ్గిపోతుంది. సత్కర్మ స్వార్థరహితంగా చేస్తూ ఉంటే వారికి ఆత్మవిజయం చేకూరుతుంది. ఆత్మవిజయం అంటే మనలను మనం జయించుకోవటం. ఆత్మవిజయం కలిగితే వారికి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం పెర్ఫెక్టుగా ఉంటుంది అంటే వారి మనస్సు, ఇంద్రియాలు వారికి పూర్తిగా స్వాధీనంలో ఉంటాయి. ఆత్మవిజయం కలుగకుండా ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు. మనం శరీరాన్ని ఆత్మ అనుకొంటున్నాము. లోకాన్ని ఆత్మ అనుకొంటున్నాము. దేహం పట్ల ఆత్మబుద్ధి ఉన్నవాడికి, లోకం పట్ల ఆత్మబుద్ధి ఉన్నవాడికి ఆత్మజ్ఞానం కలుగదు. ఎవడైతే ఆత్మవిజయాన్ని సాధించి ఉన్న వస్తువును ఉన్నట్లుగా గ్రహించాడో, ఎవడైతే సత్యస్వరూపమైన బ్రహ్మాన్ని అనుభవంలోనికి తెచ్చుకున్నాడో వాడు మాత్రమే ఈ జీవకోటిని జననమరణ చక్రం నుండి విడుదల చేయగలడు, మిగతావారికి సాధ్యంకాదు.

జీవుడు వేరు, ఆత్మవేరు అనేది వ్యవహారంలో ఉంది గాని స్వరూపంలో ద్వితీయం లేదు. వ్యవహారదృష్టిని దాటి స్వరూపదృష్టి కలిగేవరకూ ప్రతీ మనిషికి దుఃఖం తప్పదు, అశాంతి తప్పదు, సంసారం తప్పదు. మనోనాశనం అవ్వాలంటే జపధ్యానములకంటే వివేకం ముఖ్యం. ఏది సత్యము, ఏది అసత్యము, ఏది మనకు ఉపయోగపడుతుంది, ఏది మనకు ఉపయోగ పడదు, ఏది నిషిద్ధకర్మ, ఏది కర్తవ్యకర్మ అని విభజించుకునే శక్తి మన బుద్ధికి అవసరం. స్వార్థం ఉన్న వాడికి పరమార్థం అందదు. మనకు స్వరూపజ్ఞానం కలుగకుండా ఎవరో

అడ్డువస్తున్నారు అని అనుకొంటున్నాము కాని మన స్వార్థమే మనకు అడ్డు వస్తోంది. నిష్కామకర్మ చేసే వాడికి, దేహభ్రాంతి లేకుండా పనిచేసేవాడికి, లోకవాసన లేకుండా పని చేసేవాడికి స్వార్థం తగ్గుతూ ఉంటుంది. దేహాత్మబుద్ధి లేనివాడికి, మమకారం లేనివాడికి దుఃఖం ఎక్కడ ఉంది. మనలో ఉన్న అజ్ఞానమే, మనలో ఉన్న వ్యక్తీభావనే మన దుఃఖానికి కారణం కాని బాహ్యపరిస్థితులుకాదు. జపధ్యానములు అవసరమే కాని నీకు దేహాత్మబుద్ధి ఉన్నంతకాలం ఎంతసేపు జపం చేసినా, ఎంతసేపు ధ్యానం చేసినా దుఃఖం నశించదు. వాడు మంచివాడు, వీడు చెడ్డవాడు అని ఎవరి గురించి తీర్పులు చెప్పవద్దు. మీరు ఒకడిని చెడ్డవాడు అంటే వాడిని మంచివాడు అనే వారు ఇంకా చాలామంది ఉంటారు. మీరు ఒకడిని మంచివాడు అంటే వాడిని చెడ్డవాడు అనే వారు ఇంకా చాలామంది ఉంటారు. ఇవన్నీ మనోకల్పితములు, వీటి గురించి ఆలోచించి మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు.

సుఖం, శాంతి, ఆనందం అనేది మన హృదయంలో తప్పించి బయట ఈ సృష్టిలో ఎక్కడా లేదు. స్వరూపజ్ఞానం కలిగినవాడికి లోకం ఎక్కడ ఉంది, వాడికి లోకం లేదు అంటే వాడు లోకాన్ని చూడడు అని కాదు లోకం తన స్వరూపానికి భిన్నంగా కనబడదు. మనకు లోకం వేరుగా కనిపిస్తోంది అందుచేత లోకాన్ని చూస్తే మనకు భయం వేస్తోంది. స్వరూపజ్ఞానం కలిగినవాడికి నేనువేరు, లోకం వేరు అనే భేదబుద్ధి ఉండదు. మనలో భేదబుద్ధి ఉన్నంత కాలం భయం తప్పదు, కోరిక తప్పదు. భయం ఉంటే నష్టం ఏమిటి? కోరిక ఉంటే నష్టం ఏమిటి? అని మీరు అడగవచ్చు. ఎక్కడ భయం ఉంటే, ఎక్కడ కోరిక ఉంటే అక్కడ దుఃఖం వచ్చేస్తుంది. అందుచేత నువ్వు కోరికలు ఏమీ పెట్టుకోవద్దు. దేహప్రారబ్ధంలో ఉన్నది వస్తుంది, లేనిది రాదు. అందుచేత ప్రారబ్ధాన్ని ఇష్టంగా అనుభవించు, సహనంగా అనుభవించు. అప్పుడు ఇంక ఇటువంటి ప్రారబ్ధం రాబోయే జన్మలో రాదు. ప్రారబ్ధాన్ని ఆందోళనగా అనుభవించకు, సహనంగా అనుభవించు అని చెపుతూ ఉంటే దీనికి భగవాన్ ఏమన్నారు అంటే ప్రారబ్ధం ఎవరికి శరీరానికే కదా. శరీరం - అది ఒక నంబర్‌వన్ అబద్ధం, దానికి ప్రారబ్ధం అని ఇంకో అబద్ధాన్ని కల్పించారు అని చెప్పారు. ఈ ప్రారబ్ధం నిజం అని అనుకొంటున్నావు కాబట్టి నువ్వు ఆందోళన చెందుతున్నావు. ఈ దేహం ఎంత అబద్ధమో, ఆ ప్రారబ్ధం కూడా అంతే అబద్ధం అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఆందోళనతో పని ఏముంది? దుఃఖంతో పని ఏముంది? నువ్వు ముళ్ళకంపల మధ్యన ఉన్నా శాంతిగానే ఉంటావు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే శాంతి అనేది, సుఖం అనేది నీ హృదయం లోనే ఉంది. లోకంలో ఎక్కడా శాంతి లేదు.

సుఖంలేదు. నువ్వు చేసే మొదటి తప్పు ఏమిటి అంటే సుఖంకోసం, శాంతికోసం లోకంలో వెతుకుచున్నావు. అంటే ఎక్కడైతే సుఖంలేదో, శాంతిలేదో అక్కడ వాటికోసం వెతుకుచున్నావు. ఉన్నచోట వెతకటం మానేసావు. అంటే బాహ్యముఖంగా తిరుగుచున్న నీ మనస్సును అంతర్ముఖం చేస్తే ఇంక నీకు అశాంతి లేదు, దుఃఖం లేదు.

మీ ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం వస్తే మీకు దుఃఖం వచ్చేస్తుంది. మీ ఇంటి ప్రక్కన ఉన్నవారికి ఎవరికైనా అనారోగ్యం వస్తే మీకు దుఃఖంరాదు ఎందుచేత? ఈ శరీరం నాది అనుకోవటం వలన, ఈ శరీరంతో అనుబంధం ఉన్నవారు నీ వాళ్ళు అనుకోవటం వలన ఆ మమకారంలోనుండే దుఃఖం వస్తోంది. సంసారానికి, పునర్జన్మలకు కూడా ఈ మమకారమే కారణం. ఆచార్యులవారు ఏమన్నారు అంటే ఎవరూ నావారు కాదు, నేను ఎవ్వరివాడిని కాదు అని నీకు అర్థమైతే ఇంక నీకు దుఃఖం ఏమిటి? అన్నారు. నువ్వు కాని దానిని నువ్వే అనుకొంటున్నావు దానికి అవిద్య కారణం. అవిద్య నశించే వరకు మమకారం నశించదు, దుఃఖం నశించదు. అవిద్యను నాశనం చేసుకోవటానికి నువ్వు ప్రయత్నం చేయాలి, భగవంతుడి పట్ల భక్తి కలిగి ఉండాలి, గురువు పట్ల భక్తి కలిగి ఉండాలి. నీ ప్రయత్నానికి వారు సహకారం అందిస్తే కాని అవిద్య నశించదు. అవిద్య ఎప్పుడైతే నశించిందో నువ్వు కానిదానిని నువ్వే అనుకొనే బుద్ధిపోతుంది, అప్పుడు ఎటుచూసినా శాంతే, ఎటు చూసినా సుఖమే. సత్యాన్వేషణ మీదే మీ బుద్ధిని పెట్టండి. చేసే ప్రయత్నం చిత్తశుద్ధితో చెయ్యండి, కపటం పనికిరాదు. రామకృష్ణ పరమహంసగారికి అంత ఖ్యాతి రావటానికి కారణం ఆయన మాటలోగాని, చేతలోకాని ఎక్కడా కపటం లేదు. మీరు సాధన చేస్తున్నారు కాని ఎందుకు సక్సెస్ అవ్వటం లేదు అంటే మీరు చేసే ప్రయత్నంలో చిత్తశుద్ధి లేదు, హృదయ పూర్వకంగా మనం ప్రయత్నం చేయటం లేదు. కొంతమంది సమాజాన్ని చూసి, లోకాన్ని చూసి భయపడుతూ ఉంటారు. ఎవడైతే లోకాన్ని భయపెట్టడో, లోకాన్ని చూసి ఎవడైతే భయపడడో అట్టి భక్తుడు అంటే నాకు బాగా ఇష్టం అని పరమాత్మ చెప్పాడు. మీరు చేసే పని వలన మీకు ఆనందం రావాలి. మీరు విసుగ్గా పని చేస్తారు అనుకోండి. ఏదో మనకు ఈ ప్రారబ్ధం వచ్చింది అని అలా చేస్తారు అనుకోండి దానివలన మీకు ఆనందం రాదు. మీరు కర్తృత్వం లేకుడా పనిచేయ్యాలి. భగవంతుడు మనకు ఈ అవకాశం ఇచ్చాడు కాబట్టి చేస్తున్నావు అనే భావనతో చెయ్యాలి, భగవంతుడు అవకాశం ఇవ్వకపోతే ఆపని మీరు ఎలా చెయ్యగలరు. ఆయన అవకాశం ఇచ్చాడు కాబట్టి చేస్తున్నారు. ప్రపంచంలో ఉన్న ఐశ్వర్యం అంతా ఈశ్వరుడిదే. ఈశ్వరుడు మన ప్రారబ్ధానికి

ఎంతైతే కేటాయించాడో అంతే ఐశ్వర్యం వస్తుంది కాని అంతకంటే ఎక్కువరాదు. ఆశపడటం వలన ఎక్కువ వచ్చేయదు, ఆశ లేకపోవటం వలన తక్కువ రాదు. ఇదంతా అసత్యమే. దేహమే సత్యం కానప్పుడు ప్రారబ్ధం సత్యం ఎలా అవుతుంది?

మీరు చెవులతో ఎంతసేపు లోకం గొడవలు వినటం తప్ప ఇంకో పని లేదు. లోకానికి సంబంధించిన విషయాలు చెపితే మీరు ఆనందంగా వింటున్నారు కాని ఆత్మజ్ఞానం గురించి చెపుతూ ఉంటే మీకు ఆనందం కలగటంలేదు. మీ చెవులను లోకానికి అమ్ముకోవటం ఎందుకు అంటున్నారు భగవాన్. లోకానికి సంబంధించిన ఏ వార్త విన్నా అందులో దోషం ఉందని మీకు తెలియటం లేదు. నిరంతరం లోకవిషయాలు వినటం వలన మీ మనస్సు పొల్యూట్ అయిపోతుంది. వ్యక్తిభావనలోనే దుఃఖం ఉంది, వ్యక్తిభావన లేనివాడికి దుఃఖం లేదు, ఏ సమస్యలు లేవు. హద్దులు లేని, పరిమితులు లేని ఆత్మగా ఉన్న మిమ్మల్ని ఒక దేహానికో, మనస్సుకో మిమ్మల్ని కట్టేసుకుంటే వ్యక్తిభావన కలుగుతుంది. వ్యక్తిభావన అనేది నిజంకాదు, అదికూడా కల్పితం, కొంచెం విచారణ చేస్తే అది పోతుంది. మీరు జపం చెయ్యండి, ధ్యానం చెయ్యండి కాని అన్నింటికంటే ముందు సబ్జక్టును ప్రోపర్‌గా అర్థంచేసుకోండి. మా అత్తగారు మంచిది కాదు, మామగారు మంచివారు కాదు, వారివలన దుఃఖం వస్తోంది అని చాలామంది అంటారు. అసలు మీ లోపల ఉండి ఎవడైతే దుఃఖపడుతున్నాడో, వాడు ఎవడు అని విచారణ చేస్తే ఈ బయటి కారణాలతో సంబంధంలేకుండా మీకు దుఃఖం ఆగిపోతుంది. మీరు దుఃఖంలేని స్థితికి, ఆనందస్థితికి ఎదిగివచ్చినప్పుడు బయట కారణాల వలన దుఃఖం వస్తున్నప్పటికి ఆ దుఃఖస్పర్శ మిమ్మల్ని అంటదు, వారు ఏదో మిమ్మల్ని కష్టపెట్టేస్తున్నారు అనే తలంపు కూడా మీకు రాదు.

ఇప్పుడు మీకు బయట కారణాలు అన్నీ బాగున్నాయి అనుకోండి, వాటివలన మీకు సంతోషం వస్తోంది అనుకోండి. ఆ సంతోషం ఎంతకాలం ఉంటుంది. మీరు ఎంతకాలం ఉంటారు. మీ కుటుంబపరిస్థితులు అన్నీ బాగున్నాయి అని ఈ శరీరాలు వెయ్యి ఏళ్ళు ఉంటాయా? మీకు బాగా డబ్బు ఉంది అనుకోండి. ఆ డబ్బు ఉండగా ఈ శరీరం పోవచ్చు లేకపోతే ఈ శరీరం ఉండగా డబ్బు పోవచ్చు. ఇవి ఏమీ నిజంకాదు. మీరు మందబుద్ధులు కాబట్టి ఇది అంతా నిజంకింద మీకు కనిపిస్తోంది. నువ్వు బయట గొడవలలోనికి వెళ్ళవద్దు. నువ్వు ఏదిగా ఉన్నావో అదిగా ఉండటానికి ప్రయత్నం చెయ్యి. నీకు మరొక పేరే సుఖం, నీకు మరొక పేరే ఆనందం, నీకు మరొక పేరే శాంతి, దానిని అందుకోవటం మానేసి ఎందుకువయ్యా

రోడ్డు మీద ఉన్న పెంకుముక్కలకోసం తిరుగుతావు. దానిని అందుకోవటానికి ప్రయత్నం చెయ్యి, చిల్లర గొడవలు వద్దు. నీ ప్రారబ్ధం మంచిగా ఉన్నా, చెడ్డగా ఉన్నా అది నీవు కానప్పుడు దాని గోల నీకు ఎందుకు? అంటారు భగవాన్. అది మంచి ప్రారబ్ధం అవ్వవచ్చు, చెడు ప్రారబ్ధం అవ్వవచ్చు, ప్రారబ్ధం దేహానికే కదా. ఆ దేహం నీవుకాదని నీకు తెలిసినప్పుడు ఆ ప్రారబ్ధం గొడవ నీకు ఏమిటి? అది మంచి అయినా ఏమీ లేదు, చెడ్డ అయినా ఏమీ లేదు, అంతా స్వప్న సమానం. మనకు ఒకోసారి మంచి స్వప్నాలు వస్తాయి. ఒకోసారి చెడ్డస్వప్నాలు వస్తాయి, మెలకువరాగానే అదీ అబద్ధమే, ఇదీ అబద్ధమే. నీ జీవితంలో జరిగిన సంఘటనలు అన్నీ కూడా అవి నీకు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా వాస్తవంలో అవి అన్నీ అబద్ధాలే. ఆ అబద్ధాలను చూసి నీకు దుఃఖమేల, భయమేల, అశాంతి ఏల అంటున్నారు.

నువ్వు అన్నమాట ఎవరైనా కాదంటే, లేకపోతే వారు అన్నమాట నువ్వు కాదంటే, ఎందుకు అలా కాదంటున్నారో దానికి సంబంధించిన అవగాహన మీకు పెరిగితే ఆ సమస్య పరిష్కారం అవుతుంది. అవగాహన చాలా ముఖ్యం. అవగాహన పెరుగుతూ ఉంటే చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. అయితే మనమందరం తలకాయలేని మనుషులుగా తయారవుతున్నాము. మీరు జపధ్యానములు తరువాత చేద్దురుగాని కంగారుపడకండి ముందు మీ తలకాయను ఉపయోగించుకోండి అంటే అవగాహన పెంచుకోమని చెప్పటం. మీకు ఏదైనా సమస్య వస్తే దానిని ఫేస్ చెయ్యండి అంతేగాని పారిపోవద్దు. ఈ జన్మలో కాకపోయినా రాబోయే జన్మలో అయినా ఆ సమస్యను పరిష్కారం చేసుకోవాలి. అజ్ఞానం అనేది అనేక జన్మల నుండి వస్తోంది. అది మీ సొంత సమస్య. దానిని మీరే పరిష్కారం చేసుకోవాలి గాని ఎవరో వచ్చి పరిష్కారం చేస్తారని ఎదురుచూడవద్దు. ఒక వెయ్యి సంవత్సరాల నుండి ఒక గదిలో చీకటి ఉంది అనుకోండి. ఆ గదిలో మీరు దీపం వెలిగించారు అనుకోండి. నేను వెయ్యి సంవత్సరాలనుండి ఇక్కడ ఉన్నాను, నేను ఎక్కడికి పోతాను అని చీకటి అనదు, దీపం వెలిగించిన వెంటనే చీకటి పోతుంది, వెలుతురు వచ్చేస్తుంది. అలాగే కొన్ని వేల జన్మల నుండి మీలో అజ్ఞానం ఉండవచ్చు కాని గురువు అనుగ్రహం వలన, దైవానుగ్రహం వలన మీరు ఆత్మజ్ఞానాన్ని సంపాదిస్తే అజ్ఞానం వెంటనే నశిస్తుంది, మీరు ఆనందప్రవాహంలో, శాంతిప్రవాహంలో ఈదులాడతారు.

సమస్యలు అన్నీ మనస్సు రూపంలో ఉన్నాయి. మనస్సు అణిగిపోతే సమస్యలు అంటూ ఏమీలేవు. సమస్యలను పరిష్కారం చేసుకోవాలి అనుకొన్నప్పుడు మీరు కలిసి కూర్చొని

మాట్లాడుకోండి. ఒక అవగాహనకు రావాలి, అసలు మీరు చెప్పేది ఎదుటి వారికి అర్థమవ్వాలి కదా. ఈ మధ్యన ఒక ఆవిడ అంటున్నారు, నువ్వు గుడికి వెళ్ళకు, మీటింగులకు వెళ్ళకు అని మా ఆయన అంటున్నారు. ఆయన నన్ను ఏమైనా డబ్బుపెట్టి కొన్నారా అని అడుగుతోంది. ఆయనకు ఇష్టంలేకపోతే గుడికి వెళ్ళటం మానేయవచ్చు. నన్ను వెళ్ళవద్దు అని చెప్పటం ఏమిటి? ఆయన నన్ను పెళ్ళిచేసుకొన్నాడు, ఆ పెళ్ళి పర్పస్ ఏదో నెరవేరుతోంది కదా. డబ్బు పెట్టి బజార్లో జంతువును కొన్నట్లుగా నన్ను ఆయన కొన్నాడా? నన్ను ఏమైనా జంతువు అనుకుంటున్నాడా? పైగా నేనే కట్నం ఇచ్చాను కాని ఆయన నాకు ఏమీ డబ్బు ఇవ్వలేదు. పోనీ నేను చెప్పినట్లు ఆయన ఏమైనా చేస్తాడా? లేదు. ఆయనకు మైండ్ ఎలా ఉంటుందో నాకు మైండ్ ఉంటుంది కదా. అంటే దీని అర్థం ఏమిటి అంటే మనిషికి ఎంతో కొంత ఫ్రీడమ్ ఉండాలి. ఎంతో కొంత ఫ్రీడమ్ లేకపోతే మనిషి బతకలేడు, వాడికి మెంటల్ వచ్చేస్తుంది. పోనీ ఆయన చెప్పినట్లే గుడికి వెళ్ళను, మీటింగులకు వెళ్ళను. ఇద్దరం ఇంట్లోనే కూర్చుని ఆయన వంక నేను, నావంక ఆయన అలా ఎంతసేపు చూసుకొంటాము అంటోంది. కొంతమంది వారు గుడికి వెళ్ళకపోయినా ఇంట్లోవారిని అభ్యంతరం పెట్టరు, మీకు వెళ్ళాలి అంటే వెళ్ళిరండి అని చెపుతారు.

నీ హృదయంలో ఒక నిజం ఉంది, అది నీకు తెలియకపోవటం వలన నిజం కాని విషయాలు అన్నీ నీకు నిజంకింద కనిపిస్తున్నాయి. ఈ ప్రపంచం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు, ఊరికే అలా ఉంది అంతే. ఒక చెట్టు ఉంది. ఆ చెట్టుకింద కొంతమంది కూర్చుంటారు. ఆ చెట్టుకింద కూర్చొని నీడను పొందినా, ఆ చెట్టుకు వేలాడి చనిపోయినా ఆ చెట్టుకు సంబంధం లేదు. ఈ ప్రపంచం కూడా చెట్టులాంటిదే. ఈ ప్రపంచం మంచిదీకాదు, చెడ్డదీకాదు, అది ఎలాగ ఉండాలో అలాగ ఉంది. నువ్వు లేనిపోని గొడవలు అన్నీ ప్రపంచం మీద ఆరోపించుకొంటున్నావు. మాయ అంతా నీ మనస్సులో ఉంది. ప్రపంచం మంచిది అనుకొన్నా నీ మనస్సే. అది చెడ్డది అనుకొన్నా నీ మనస్సే. అది రెండూ కాదు. చెడ్డపనులూ భగవంతుడే చేయిస్తున్నాడు, మంచి పనులూ భగవంతుడే చేయిస్తున్నాడు అనుకొన్నప్పుడు మనిషికి దుఃఖం ఎందుకు వస్తోంది అని ప్రశ్న. మంచిపని చేసినా, చెడ్డపని చేసినా ప్రేరణ భగవంతుడి దగ్గరనుండే వస్తోంది అనుకో. ఆ మంచిపనికి, చెడ్డపనికి కూడా నేను కర్తను కాదు అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇంక నీకు దుఃఖమేల. మొత్తం మీద అంతా ముండనం చేసి వదిలిపెడుతున్నాడు. నువ్వు కర్తవుకాదు అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు పొంగిపోవటంలేదు, కుంగిపోవటంలేదు, జన్మలేదు, పునర్జన్మలేదు. అంతా భగవంతుడే

చేయిస్తున్నాడు అని నోటితో అంటున్నావు కాని ఆ చెడ్డ పనులకు, మంచిపనులకు నేను కర్తను అని లోపల అనుకొంటున్నావు. అందుచేత నీకు దుఃఖం వస్తోంది. నువ్వు నోటితో చెప్పిన వాక్యంమీద నీకు నమ్మకం ఉంటే, అది నీకు అనుభవంలో ఉంటే నీకు దుఃఖం రానేరాదు. అంటే వాడు చెప్పిన అబద్ధాన్ని వాడి మొఖంమీద పెట్టి కొట్టటం. మీకు ఏ కారణం వలన దుఃఖం వచ్చినా అది సత్యం కాదు, అది అసత్యమే. గాఢనిద్రలో ఎవరికీ దుఃఖం ఉండదు. అసలు ఏ కారణం వలన దుఃఖం వచ్చినా అది కల్పితమే.

దుఃఖంకూడా ఒక తలంపేనా అని భగవాన్‌ను అడిగితే దుఃఖంకూడా ఒక తలంపు అనికాదు, అన్ని తలంపులూ దుఃఖమే అని చెప్పారు. మీకు ఏ తలంపు వచ్చినా మీరు స్వరూపాన్ని విడిచిపెట్టి బయటకు వచ్చేస్తున్నారు. అందుచేత ఏ తలంపు వచ్చినా అది దుఃఖానికే దారి తీస్తుంది. నీకు నిద్రలో నుండి మెలకువ రాగానే నేను అనే తలంపు వస్తుంది. అది తలంపే, అది నిజం కాదు. ఆ నేను అనే తలంపు రాగానే ఆ తలంపు దేహంతో తాదాత్మ్యం పొందుతుంది. అక్కడ నుండి దుఃఖం ప్రారంభమవుతుంది. దేహము నేను అనే తలంపు ఎంత నిజమో నీకు వచ్చే దుఃఖం కూడా అంతే నిజం. నిన్ను నమ్మమని భగవాన్ చెప్పటం లేదు, ఆలోచించమని చెపుతున్నారు. దేవుడు ఉన్నాడని నమ్మమని భగవాన్ ఎప్పుడూ చెప్పరు. నీకు దేవుడు ఉన్నాడని నమ్మకం ఉంటే నీ మనస్సును వాడికి ఇచ్చేయి, దేవుడు మీద నమ్మకం లేదు అంటావా నీ మనస్సును బోనులో ఎక్కించి విచారణ చెయ్యి. నువ్వు విచారణ చేసినా అది పోతుంది, భగవంతుడికి శరణాగతి చేసినా అది పోతుంది. నువ్వు భక్తిమార్గంలో ప్రయాణం చేసినా, విచారణా మార్గంలో ప్రయాణం చేసినా ఈ నేను అనే తలంపులోనుండి విడుదల పొందాలి. దేహము నేను అనే బుద్ధిలోనుండి నువ్వు విడుదలపొందకపోతే నువ్వు కోటి జన్మలు ఎత్తినా దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. దుఃఖం ఎక్కడ ఉంది? నీ మనస్సులో ఉంది. అందుచేత నీ మనస్సు అణిగిపోతే దుఃఖం అణిగిపోతుంది. ఇప్పుడు నువ్వు ఏదైతే నేను నేను అంటున్నావో దాని చుట్టూ తిరుగుతున్నావు. అది దొంగ నేను. దాని వెనకాల ఒక నిజమైన నేను ఉందని నీకు తెలియటం లేదు. ఎందుచేతనంటే నువ్వు పూర్వజన్మలలో సత్కర్మ చెయ్యలేదు, కనీసం మనస్సులో అయినా ఇతరుల సుఖాన్ని కోరుకోవటంలేదు, ఒక విచారణ లేదు, గురువు అనుగ్రహం లేదు, సమాజం దేవుడిని ఎప్పుడూ ఆరాధించటం లేదు, ఇంక నీకు నిజమైన నేను గురించి ఎలా తెలుస్తుంది.

మీరు ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకోండి. వీటివలన ప్రమాదం ఏమిటి అంటే ఇష్టాలు,

అయిష్టాలు వలన నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. ఉద్రేకం తగ్గించుకోండి. ఉద్రేకం పెరిగేకొలది ఆలోచన తగ్గిపోతుంది. సమస్యను ఉన్నది ఉన్నట్లుగా ఆలోచించలేము. సమస్య వచ్చినప్పుడు ఎవరైనా ఉద్రేకంగా మాట్లాడుతున్నారు అనుకోండి, మీరు ఉద్రేకపడుతున్నారు అనకుండా రెండు రోజులు ఉన్నాక మాట్లాడుకొందాము నాకు తొందరపని ఉంది, ఈ రోజుకు వాయిదా వేద్దాము అంటే సరిపోతుంది. మీకు తొందరపని లేకపోయినా అలా చెప్పాలి. అటువంటి అబద్ధాలవలన మీకు పాపం వచ్చేయదు. ఎందుచేతనంటే మీకు దుర్బుద్ధి ఉండి ఆ మాట చెప్పటంలేదు, మీ హృదయంలో దోషం లేదు, సమస్య పరిష్కారం కోసం అలా చెపుతున్నారు. అది బాహ్యంగా చూస్తే అబద్ధమే కాని మీ హృదయంలో దోషం లేదు కాబట్టి దాని వలన పాపం మీకు అంటదు. నేను పుట్టినప్పటి నుండి కష్టాలే, అన్నీ బాధలే. నేను పూర్వజన్మలో ఏమైనా దోషాలు చేసానా, ఆ దోషమే ఇప్పుడు దుఃఖరూపంలో వచ్చిందా అని అడుగుతున్నారు. పూర్వ జన్మలో దోషాలు చేసి ఉంటే నువ్వు చెప్పే పూర్వజన్మ ముందు ఇంకో జన్మ ఉండాలి కదా ఇలా ఎన్ని జన్మలు వెనక్కి వెళతావు, అలా వెళితే నీకు సరియైన సమాధానం రాదు. నీకు నిజంగా ఎన్ని జన్మలు వచ్చినా ఆ జన్మలన్నింటికి నీలోపల ఉన్న అవిద్య కారణం. అవిద్య ఇప్పుడు కూడా నీకు ఉంది. పూర్వజన్మలో ఏదో చేసాను, ఇప్పుడు అనుభవిస్తున్నాను అని చెప్పేది ఆత్మకాదు, నీలో ఉన్న అవిద్యే చెపుతోంది. అవిద్య ఎలా పోతుంది అంటే ఆత్మవిద్య కలిగితే అవిద్య నశిస్తుంది. అందుచేత అవిద్యను నాశనం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి కాని ఏదో జన్మ వచ్చింది, అప్పుడు ఏదో దోషం చేసాను, ఆ దోషం దుఃఖరూపంలో వస్తోంది అని ఇలా అనుకొంటూ ఉంటే ఇంక దానికి ముగింపు ఉండదు. ముందు అవిద్యను తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. దానికోసం సజ్జన సాంగత్యం చెయ్యి, సద్గ్రంథ పఠనం చెయ్యి.

జరగవలసినది ఏదో జరుగుతుంది. మీరు దేనిగురించి వర్రీ పడవద్దు. మీరు ఎంతవరకు ప్రయత్నం చేయగలిగితే అంతవరకు చెయ్యండి. జరిగిపోయిన గొడవల గురించి ఆలోచించవద్దు, బాధపడవద్దు. మిమ్మల్ని ఎవరైనా పొగుడుతూ ఉంటారు, ఎవరైనా విమర్శిస్తూ ఉంటారు. ఈ రెండూ అబద్ధాలే అన్నారు భగవాన్. ఆ మాటలలో దోషం ఉంది. ఎందుకు ఆ మాటలు వింటున్నారు, ఆ రెండూ కూడా మీ మనస్సును పొల్యూట్ చేస్తాయి. ఆ మాటలలో దోషం ఉందని మీకు తెలియకపోవటం వలన మీ చెవులను మార్కెట్‌కు అమ్ముకొంటున్నారు. పూర్వం గొడవ వదిలెయ్యండి ఇప్పుడు దుఃఖం లేకుండా ఉండాలి అంటే నేను ఎలా ఉండాలి అని అడుగుతున్నారు. నువ్వు ముందు కళంకం లేకుండా

చూసుకో, మాటలోగాని, చేతలోగాని కపటం లేకుండా చూసుకో, త్రికరణశుద్ధిగా పనిచెయ్యి. అప్పడు నీ మనస్సు అనే బట్ట చిరిగిపోతే లోపలఉన్న ఆనందం నీకు గోచరిస్తుంది, అది నీకు అనుభవంలోనికి వస్తుంది. మన హృదయంలో నుండి సహస్రారానికి ఒక నాడి ఉంటుంది, దానిని అమృతనాడి అంటారు. సర్వసాధారణంగా అందరిలోను అది మూసుకొని ఉంటుంది. దైవానుగ్రహం వలన, గురువు అనుగ్రహం వలన, మీ పుణ్యం పండటం వలన అది ఓపెన్ అయ్యింది అనుకోండి లోపలఉన్న సుఖసముద్రం వచ్చి మీ సహస్రారాన్ని ముంచేస్తుంది. అది నువ్వు తట్టుకోలేవు కాబట్టి నీకు ఇవ్వటానికి భగవంతుడు ఆలస్యం చేస్తున్నాడు. ఇంకా నువ్వు దానికి డిజర్వు అవ్వలేదు అందుకే ఆయన లేట్ చేస్తున్నాడు. అలాగని మీమీద భగవంతుడికి దయ లేదని అనుకోవద్దు.

నా శరీరం బాధ పడుతోంది, నా మనస్సు దుఃఖపడుతోంది అంటున్నావు. ఆయన ఒక్కసారి అమృతనాడిని ఓపెన్ చేసాడు అనుకో అయ్యబాబో ఆనందం భరించలేకపోతున్నాను అని చచ్చివూరుకుంటావు. ఇప్పడు దుఃఖం భరించలేకపోతున్నావు, అప్పడు ఆనందం భరించలేవు. టైము వస్తుంది కంగారు పడకు. ఇప్పడు నీ శరీరం దుఃఖం అనుభవించవచ్చు, ఇది ఎప్పడూ ఉండదు. నువ్వు గతంలోనికి వెళ్ళకు. అవిద్యను రెడ్యూస్ చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అప్పడు సుఖం, శాంతి నీకు అందుతాయి. నేను దుఃఖపడిపోతున్నాను అని ఇప్పడు నువ్వు ఎలా చెపుతున్నావో మరల నాదగ్గరకు వచ్చి శాంతిని, సుఖాన్ని భరించలేకపోతున్నాను సర్ఫెలెస్ అయిపోతోంది అని నువ్వు చెప్పే రోజులు వస్తాయి. జ్ఞానికి ఈ లోకంలో బాధలు కనిపిస్తాయా అని అడిగితే భగవాన్ ఏమంటున్నారు అంటే జ్ఞాని దృష్టిలో లోకమే లేదు, ఇంక లోకంలో బాధలు కనిపించటం ఏమిటి అంటున్నారు. మనకు ఎప్పడైనా కల వస్తుంది కదా, ఆ కలలో మనకి దుఃఖం వస్తుంది. జ్ఞానికి లోకం కనిపిస్తున్నప్పటికీ, లోకంలో దుఃఖం కనిపిస్తున్నప్పటికీ కల ఎంత నిజమో, కలలో వచ్చిన దుఃఖం ఎంత నిజమో ఇది కూడా అంతే నిజం అని వాడికి అనిపిస్తుంది, వాడు జ్ఞాని. శరీరం ఒక అబద్ధం, ప్రారబ్దం ఒక అబద్ధం. ఈ అబద్ధాన్ని తీసుకొనివచ్చి ఆ అబద్ధానికి కట్టేస్తున్నారు. ఎంత గొడవ, ఎంత అల్లరి అంటున్నారు భగవాన్. మీరు ఇక్కడపడి ఉంటున్నారు. మీ హృదయం వైపుకు ఎప్పడు కళ్ళు తెరుస్తారు. మీరు నిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి వచ్చేస్తున్నారు. అలాగే ఈ జాగ్రదవస్థలో నుండి హృదయంలో ఉన్న నిజంలోనికి మేల్కోవాలి. అప్పటివరకు నీ ప్రయాణం ఆపుచేయవద్దు. నువ్వు నిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి మేల్కోవటం కాదు అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి మేల్కోవాలి.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

# నిజమైన శ్రీరమణాశ్రమం

శ్రీ రమణాశ్రమం అంటే మనకు సుమారు 800 కి.మీ. దూరంలో తమిళనాడులో ఉన్న ఇటుకలు, సిమ్మెంటుతో నిర్మింపబడిన భవన సముదాయం అనుకొంటాం, కాని అది నిజం కాదు. మన దుఃఖానికి, అశాంతికి కారణం బయటి వస్తువులు, సంఘటనలు అని భ్రమపడి దుఃఖకారణాన్ని బాహ్యంలో వెతుకుతాం. కాని నిజమైన దుఃఖకారణం దేహాత్మ బుద్ధియే! ఈ దేహాత్మబుద్ధిని అతిక్రమించాలంటే "నేనెవరు?" అనే విచారణ ఆవశ్యకం. "నేనెవరు?" అనే విచారణా యుక్తమైన మనస్సే నిజమైన శ్రీరమణాశ్రమం.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్,**
**అమలాపురం**

# అహంకార పరిత్యాగం

మిథ్యా స్వరూపమైన అహంకారాన్ని త్యాగం చేస్తే, మనము సచ్చిదానంద స్వరూపులమే అవుతాం. కాని అహంకార పరిత్యాగం అంత సులభం కాదు, దానికి కారణం అనేక జన్మల నుండి అదే 'నేను' అనుకొని తాదాత్మ్యం చెందుతున్నాం. సమాజంకన్నా, పరిస్థితుల ప్రభావం కన్నా, ప్రారబ్ధం కన్నా, మన మనస్సే మనలను ఎక్కువ దుఃఖానికి, అశాంతికి గురిచేస్తుంది. దుఃఖ కారణాన్ని బాహ్యంలో వెదుకుతాం, కాని నిజమైన కారణం దేహాత్మబుద్ధియే! సకల అరిష్టాలకు, జన్మ పరంపరకు దేహాత్మబుద్ధే కారణం. ద్వంద్వాలను సమబుద్ధితో స్వీకరిస్తే మనస్సు శాంతమవుతుంది. ఇప్పుడే, ఇక్కడే, ఈ క్షణంలోనే 'నేను' అంటే బ్రహ్మమే! ఆ ఎరుకకు ఆటంకంగా నిలిచేది దేహాత్మబుద్ధియే! అజ్ఞాన జనితమైన అట్టి దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందాలంటే కపటం లేకుండా జీవిస్తూ, అవగాహనతో గురుబోధను శ్రద్ధగా శ్రవణం చేస్తూ, మననము, నిధి ధ్యాసల ద్వారా స్వరూప అమృతస్థితిలోకి మేల్కొనాలి. పరమాత్మ మనకు ఏఏ అవకాశాలను ఎంతవరకు ఇచ్చాడో అంత వరకు వాటిని సద్వినియోగం చేసుకోవాలి. లేని వాటి గురించి చింతించకూడదు. లక్ష్యసాధన పైనే మనస్సును గురిపెట్టాలి.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్,**
**అమలాపురం**

# వాదం అజ్ఞానాన్ని ప్రదర్శిస్తుంది - విచారణ విజ్ఞానాన్ని అన్వేషిస్తుంది

విద్యావంతులైన వారిలో చాలామంది అసందర్భమైన విషయాలలో చిక్కుకుంటారు. భగవంతుణ్ణి బుద్ధితో తెలుసుకోవటం సాధ్యమనుకొంటారు. దానికి సంబంధించిన రుజువులు కోరుకొంటారు. గీత అంతా కంఠస్తం చేసినా, ఉపనిషత్తులు అన్నీ భాష్యంతో చెప్పినా, బ్రహ్మసూత్రాల సమన్వయం చేసినా అది అంతా పాయసంలో గరిటిలాంటిది. గరిటికి పాయసం అనుభూతి ఎలా తెలుస్తుంది. అంతరంగమైన సత్యానుభవం లేశమైనా లేనప్పడు ఇది అంతా అజ్ఞానం యొక్క అజ్ఞానం. అనేక ముఖాలుగా ప్రసరించే మనస్సు సత్యాన్ని గ్రహించలేదు. కొందరు పండితులు మిగతావారిని అవివేకులుగాను, మూఢులుగాను జమకడతారు. రామకృష్ణులు "పసి పిల్లలవంటి స్వభావం గలవారే పరమాత్మను చేరుకొంటారు" అన్నారు. మేధాశక్తికి పాండిత్యానికి తావు ఎక్కడ. మానవుడు తన అజ్ఞానాన్ని, చాతుర్యాన్ని విడనాడాలి వారు తర్కానికి దిగుతారు, వాద వివాదాల్లో దిగుతారు వారికి అడుగడుగునా ఆటంకాలే. ప్రభువు అదృశ్యుడు, అగోచరుడు అని అనుకొనేవానికి ఏమీ లభించదు. ప్రభువు గోచరుడు అని ఘంటాపదంగా చెప్పి ఆచరించినవారు చాలా మంది ఉన్నారు. శోధించి ప్రయత్నం చెయ్యకపోతే తప్ప ఎవరిది? రోగాన్ని పోగొట్టుకోవాలంటే రోగి మందు వాడాలి, పత్యం చెయ్యాలి. వేరొకరు మందు వాడితే పోదు. అలాగే ఆత్మానుభవానికి స్వయంకృషి, గురు కటాక్షం కావాలి. అనంతమైన పరబ్రహ్మ జ్యోతి అభిముఖమైనప్పడే నిజమైన విద్య ప్రారంభమౌతుంది. విజ్ఞాన వాహిని వెల్లువిరుస్తాయి" అన్నారు. అంతేగాని గ్రంధాల్లోని విషయాలను ఆ ఎంగిలి ముక్కలతో ఎవరినీ ప్రభావితం చెయ్యలేరు. విద్యావంతులు భగవంతుని ఇంట కాపలాదార్లు వారు స్వయంగా లోపలికి వెళ్లలేరు ఏ భక్తుడైనా వెళ్లానంటే నమ్మరు. అస్పష్టత సత్యానికి అడ్డుకట్ట. వాదాలు విభజిస్తాయి. విభజనకు సులభోపాయం వాదం. ప్లేటో "పాఠశాలలు, కళాశాలల్లో బోధించేది విద్యకాదు అసలు విద్యకు అది ఒక సాధనం మాత్రమే. తన్ను తాను జయించిన వానికి కవిత్వ కవాటాలు తెరుచుకుంటాయి" అన్నారు. నా కవిత్వం నా ప్రసంగం బాగుండాలని ఆనందించేవాడికి సామర్థ్య స్థితిలో ఉండలేడు లేదా వ్రాస్తున్నాను అనే దేహ స్తుతి ఉన్నంతకాలం వ్రాయలేడు. వేద రహస్యాలు గ్రహించనివారు కన్నులుండి గ్రహించలేదు. రమ్యమైన వస్త్రం ధరించిన భార్య తన భర్తకు మాత్రమే తన శరీరాన్ని చూపుతుంది. అలాగే వేద సత్యం విశ్వసించి, ఆకాక్షించి కోరే భక్తాగ్రేసరులకే గోచరిస్తుంది. పూర్ణభక్తికి పూర్ణజానానికి తేడా లేదు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**